


# శ్రీ సాయి దర్శన్


సాయి ప్రబోధ ప్రచార మాసపత్రిక

సంపుటి-7 | ఆగష్టు - 2008 | సంచిక 9

SRI SAI DARSHAN

*(SaiPrabhodha Prachar Monthly)*

Editor : **Raojee**

Associated Editor : **A. Lakshmi**

**Subscription Rates**

| | |
|---|---|
| Maharaja Poshakulu | Rs.1,501-00 |
| Life Membership (20 Yrs) | Rs.751-00 |
| For 3 Years | Rs.275-00 |
| For 1 Year | Rs.100-00 |

M.O's / DD's may be drawn in favour of



**SRI SAI DARSHAN**
Dammaiguda, Nagaram Post,
Hyderabad - 500 083.
Phone : 040-65640220
Cell : 98667 48099
e-mail : srisaidarshan@rediffmail.com
Website : www.srisaidarshan.org.in


**శ్లో॥ శరీరం సురుపం తధా వా కళత్రం**
**యశాశ్చారు చిత్రం ధనం మేరు తల్పం**
**గురోరఘ్రిం పద్మే మన శ్చేన్న లగ్నం**
**తతః కిం తతః కిం తతః కిం తతః కిమ్**

తా॥ సుందరమైన శరీరముండినను, చక్కటి భార్యయుండినను, గొప్ప కీర్తి యుండినను, మేరు పర్వత సమానమగు ధనముండినను గురుదేవుని పాదపద్మముల చెంత మనస్సు లగ్నము కానపుడు వీటన్నిటి వలన నేమి ప్రయేజనము?

# విషయసూచిక


సంపాదకీయం....................................................................3
శ్రీసాయిసద్గురు సమర్ధ- సగుణోపాసన..........................................4
భక్తవత్సలుడు శ్రీసాయి.......................................................5
మనమెలా జీవించాలి?..........................................................10
నిజమైన ఫకీరు..................................................................15
విభూతి యోగము..............................................................20
బాలకృష్ణ విశ్వనాథ దేవ్ (బి.వి.దేవ్)........................................25
సాయిస్వరూపం...............................................................29
శ్రీసాయినాథ భజనమాల.......................................................30
అబ్దుల్లా బాబా.................................................................36
పిలిచిన పిలుపే విశ్వవిఖ్యాతి గాంచిన వేళ.................................39
సాయినాథ ఉవాచ.............................................................41
మంచి మాటలు.................................................................46
శ్రీసాయిబాబా జన్మరహస్యం...................................................47
సంకల్ప స్పందనము, శక్తిపాతము..........................................51
శ్రీలలితా సహస్రనామములు...................................................52
ఓంకారస్వరూపుడు శ్రీశిరిడీ సాయినాథుడు...............................54
తేలికైన యజ్ఞం.................................................................66
పంచభూతాలు..................................................................68
దాన ధర్మాలు....................................................................70
ఓం సాయి శ్రీసాయి జయ జయ సాయి చేసిన స్థలములు వాటి ప్రాముఖ్యత..........................................................73
సాయినామం సర్వపాపహరణం, సాయిస్మరణం భవ హరణం.......76
లేఖలు............................................................................78




శ్రీసాయినాథాయనమ ః

ఈనాడు ప్రపంచంలో ఎక్కడ చూసినా గురువులు లభ్యమవుతున్నారు. పరస్పర విరుద్ధ బోధలు చేస్తారు. ప్రతి గురువు ఒక క్రొత్త మార్గాన్ని చూపుతుంటారు. అసలు గురువంటే శిష్యుడి అంతఃశక్తిని జాగృతం చేసి ఆత్మానందములో రమింపజేయగల వ్యక్తి మాత్రమే గురుస్థానములో వుండగలడు.

గురువు శిష్యుడు సంపాదించి పెట్టుకున్న వస్తుసామగ్రిని కానీ, సంపదను కానీ, త్యాగము చేయమని కోరడు. జీవత్వభావాన్ని త్యాగం చేయిస్తాడు. జీవితముపట్ల ద్వేషము, వ్యక్తిత్వము పట్ల ఈర్ష్య ద్వంద్వము పట్ల కోపము కలిగి ఉండటము ఆయన గుణం. అంతేకానీ పరమాత్మ సృష్టించిన ఈ ప్రపంచములోని వస్తువులను నీ చేత త్యాగము చేయించి నీ అంతరంగాన్ని శూన్యము, శుష్కము చేయడు. శిష్యుడు ఆర్థికమైన బలవంతుడా అని కాదు. గురువు అన్వేషించేది, అతను ఆధ్యాత్మికముగా, మానసికముగా ఎంత బలవంతుడా అని. నిజమైన సద్గురువు తలిస్తే భగవంతుడే పరుగులు తీస్తాడు. సంపూర్ణ శరణాగత తత్త్వము అంటే అంత గొప్పది. డబ్బులు కోసము ఎదురుచూసే గురువులను నమ్మవలసిన అవసరము లేదు.

# శ్రీసాయిసద్గురు సమర్థ-సగుణోపాసన

మూలం :- శ్రీకృష్ణారావ్ జోగేశ్వర్ భీష్మ అనుసరణ : నైనారు అప్పాస్వామి

రెండవ భాగం- మధ్యాహ్న ఆరతి 12 గం॥లకు (గత సంచిక తరువాత భాగం)

(–)

## 3. షిరిడి నా పండరిపురం

(1) షిరిడీ నా పండరిపురం
సాయిబాబా ఆ క్షేత్ర దైవం
సాయిబాబా ఆ క్షేత్ర దైవం.

(2) శుద్ధ భక్తి ప్రవాహమే చంద్రభాగానది
పుండలీకునిపై భక్తిభావాలు జాగృతమైనవి
పుండలీకునిపై భావాలు మేల్కొన్నవి
మన భక్తిభావాలు మేల్కొన్నవి

(3) రండి రండి జనులందరు రండి రండి
సాయిబాబాకు ప్రణమిల్లండి
సాయిబాబా సద్గురువుకు ప్రణమిల్లండి

(4) దాసగణు అర్థిస్తాడు
సాయిబాబా ! దయ చేయండి వేగంగా
మీ ఆశీర్వాదాలు ప్రసాదించండి దేవా !
ఓ నా మాతా ! మీ దీవెనలు ప్రసాదించండి
విచ్చేయండి దేవా ! వేగంగా

## 4. భక్త్యాంజలి

1. నాముడంటాడు, నేను మీ పాదాలయందు
మొకరిల్లుతాను దేవా ! స్పర్శిస్తాను
మీ సుందర రూపాన్ని దర్శిస్తాను
ప్రేమతో మిమ్ము ఆలింగనం చేసుకొంటాను
ఆనందంగా అర్చిస్తాను, సాయినాథా !
భక్తితో ఆరతిస్తాను దేవా !

2. మీరే నా తల్లి, మీరే నా తండ్రి
మీరే నా సోదరుడు సాయీ !
మీరే నా మిత్రుడు, మీరే నా సర్వస్వం
మీరే నా జ్ఞానం సర్వం సద్గురు సాయీ !
మీరే సర్వస్వం నా దేవా ! నా ప్రభువా !

3. నా దేహాన్ని, నా వాక్కును, నా మనసును
నా సర్వేంద్రియాలను, నా అంతరంగసత్తను
సర్వాన్నీ మీకర్పిస్తాను నారాయణా ! సాయీ!

4. అచ్యుతుని నేను ప్రార్థిస్తాను దేవా !
కేశవుని, రామనారాయణుని, కృష్ణదామోదరుని,
వాసుదేవుని, హరిని, శ్రీధరుని, మాధవుని,
గోపికావల్లభుని, జానకీనాయకుని,
శ్రీరామచంద్రుని
సద్గురుసాయిని నేను ప్రార్థిస్తాను, భజిస్తాను,
ధ్యానిస్తాను.



# భక్తవత్సలుడు శ్రీసాయి

యమ్. ఉమామహేశ్వరరావు, విశాఖపట్నం - 530 044



"సద్గురువు యొక్క భక్తులెక్కడైతే వుంటారో.... వారిని నువ్వు కంటితోనైనా చూడరాదు".

అంటూ కలియుగ ప్రారంభానికి ముందు బ్రహ్మదేవుడు కలిపురుషుని పిలిచి మరీ పైవిధంగా హెచ్చరించాడట. ఆయనంతటి వాడే తనకు ఆ విధంగా ఒక గట్టి వార్నింగు యిచ్చేసరికి పాపం కలిపురుషుని గుండెల్లో రాయిపడింది. ఎందుచేతనంటే భూలోకంలో పాపులు చాలా ఎక్కువే. వాళ్ళకు ఓ ఆట ఆడించడం తనకెంతో సరదా. అలా వాళ్ళతో పాటు సత్పురుషులను కూడా ఓ ఆటాడిద్దామని, మరీ ముఖ్యుడు దేవుడూ – పూజలూ – ఉపవాసాలూ – దీక్షలూ అంటూ మహానిష్ఠగా, దైవప్రార్థనతో కాలంగడిపే వారంతా తన దృష్టిలో పరమబద్ధకస్తులు. వారిని గూడ కాస్తంత కష్టాల్లోకి నెడితే, తనకు కావలసినంత భోజనం – తృప్తి లభిస్తుందని ఎంతో ఆశపడ్డాడు కలిపురుషుడు. కాని, ఏం లాభం......

ఒక ప్రక్క సృష్టికర్త 'బ్రహ్మ' ఆర్డరు. మరో ప్రక్క భూలోకంలో గురుసేవల్లో దీక్షలు వహించినవారు తులసీ, గోవులను పూజించేవారు, వేదశాస్త్ర, పురాణాలను విని వాటిలోని ధర్మములను ఆచరించేవారు రోజురోజుకీ పెరిగిపోతుంటే, వారిని నిరంతరం కంటికి రెప్పలా కాపాడుకుంటున్న



సద్గురువులు.... ఎలా ? ఎలా? కలిపురుషుడికి కొన్ని రాత్రిళ్ళు నిద్రలేదు. తిండి సయించక తల్లడిల్లిపోయేడు. చేసేదేమీలేక నిరాశతోనే భూలోకానికి ప్రయాణం కట్టేడు. కలియుగం ప్రారంభమైంది.

"యదా యదాహి ధర్మస్య గ్లానిర్భవతి భారత !
అభ్యుత్థాన మధర్మస్య తదాత్మానం సృజామ్యహమ్!" (గీత. 4-7)

"ధర్మానికి హాని కలిగినప్పుడు, అధర్మము పెచ్చు పెరిగి పోవుచున్నప్పుడు నన్ను నేను సృజించుకుందును. అనగా సాకారరూపుడినై అవతరిస్తాను" అంటూ కురుక్షేత్ర రణభూమిలో అర్జునునికి, శ్రీకృష్ణపరమాత్మ చెప్పిన గీతా రహస్యం గుర్తొచ్చింది ఏమోగాని, కలిపురుషుడు ముందుగ ఆచి తూచి తన ప్రజాపీడనం ప్రారంభించాలనుకున్నాడు. అందులకు ఎన్నో ఉపాయాలు ఆలోచించసాగేడు. ఆలోచనా సమయంలో ద్వాపరయుగం పూర్తయింది. పాండవులు, కౌరవులు, చివరకు శ్రీకృష్ణునితో సహా తమ అవతారాలు పరిసమాప్తి చేసుకొని స్వర్గారోహణం చేస్తూ, కలియుగానికి సాదర ఆహ్వానం పలికేసేరు.

ఇంకేం? కలిపురుషుడి పని తేలికైపోయింది. తనను అడ్డుకునేవారుగాని తన చేష్టల్ని త్రిప్పి కొట్టేవారుగాని, భూమండలం మొత్తంమీద లేరన్న నిర్ణయానికొచ్చేసేడు. తన విశృంఖల వీర, విహారానికి ప్రారంభోత్సవం చేసేసాడు. అయితే పాపం ! కలిపురుషునికి తెలియంది కూడా మరొకటుంది. అలా తన అవతారాన్ని చాలించిన పరమాత్మయే మరల తిరిగి భూలోకంలో శరణాగత భక్తవత్సలుడిగ, ఆపద్బాంధవుడిగ, అనంతకళ్యాణ కారకుడిగ, లీలా చిద్విలాసుడిగ, భక్తపరాధీనుడిగ, సర్వాంతర్యామియై సర్వులను కాపాడే



భక్తరక్షకుడిగా, శ్రీశిరిడీ సాయిగా భూలోకంలో అవతరించి తన యొక్క నడకకు బ్రేకులు వేస్తాడని, తనుచేయబోయే దహనకాండను అడ్డుకుంటాడని, గ్రహించలేదు పాపం ! అదే అతడి తప్పిదానికి అవమాన పరంపరలకు కారణమైంది....

□ □ □

కొన్ని అనుభవాలు కొందరికి ఉపకారం చేస్తే, యింకొందరికి ఎదురు నిలుస్తాయి. తన నికృష్ఠ విధానాలతో మొత్తం భూలోకాన్నే అధర్మభూమిగ మార్చేయ్యాలని ఆశపడిన కలిపురుషుడికి శిరిడీసాయిరూపంలో పెద్ద అడ్డంకే ఎదురునిలుచుంది.

"నా యొక్క భక్తుడనేవాడు సప్తసముద్రాలకు అవతల వున్నా సరే, పిచ్చుకకాలికి దారం కట్టి లాగినట్లు, అతన్ని లాగి నా దగ్గరకు రప్పించుకుంటాను" అని ఎలుగెత్తి చాటిన శిర్డీసాయిని గూర్చి ఎన్నెన్నో విశేషాలు వ్రాయగలం?

"ఎందరెందరో నా దగ్గరకొస్తున్నారు. అది లేదూ, ఇది లేదూ, అదివ్వు, యిదివ్వు అంటూ అడుగుతారే తప్ప, కాస్తంత జ్ఞానాన్నివ్వమని ఏ ఒక్కరూ అడుగరు" అంటూ భక్తుల యొక్క విపరీత చంచల మనస్సులను ఎండగట్టిన మహనీయుడు శిర్డీసాయి. తనకు కావలసిన వాడు, తనకు ప్రియమైనవాడు, నిత్యం సాయి, సాయి అంటూ తననే స్మరించేవాని జోలికి ఎవరు వచ్చినా, ఏ చెడు తలపెట్టినా-వారిని నిర్వీర్యులగు చేసి పరిగెత్తించేవాడాయన. ఎందరో భక్తులు రోజూ సాయిని దర్శించుకునేవారు. వారందరికీ విభూతినిచ్చి, తన యొక్క ప్రేమను కురిపించేవాడాయన. అందుకే భక్తులంతా ఆయన్ను భక్తరక్షకుడని మనసారా పిల్చుకునేవారు. ఎందరో భక్తులు సాయిని దర్శించడానికి

వస్తుంటే, వారిలో ఎవరు నిజమైన భక్తులో, ఎవరు కాదో ఆయనకు తెలిసిపోయేది. ఆ ప్రకారంగానే, వారి కోర్కెలు కూడా తీర్చబడేవి. ఓసారి సాయిభక్తుడైన గంగాధరునికి తీవ్రమైన సుస్తీ చేసింది. ఎందరో వైద్యులు పరిశీలించి, ఎన్నో రకాల మందులు తినిపించినా ఫలితం లేకపోవడంతో, చివరకు సాయి పాదాలపై బడి తనను రక్షించమని దీనంగా ప్రార్థించేడు. సాయి అతని కళ్ళలోకి సూటిగా చూస్తూ, "నీ జబ్బు మామూలుగా పోదు. మందు వాడినా తన్ని తగిలేస్తేగాని నువ్వు మాములు మనిషివి కాలేవు" అనంటూనే అతని జుట్టు పట్టుకుని "పోతావా ? పోవా? ... నా భక్తుడిని ఆశ్రయించి యిన్ని బాధలు పెడతావా?" అంటూ గదమాయించేసరికి, అయ్యబాబోయ్ పోతున్నా, నన్నొలిపెట్టు! అంటూ ఆ భక్తుడైన గంగాధరుణ్ణి వదిలి వెళ్ళిపోతున్న కలి పిశాచిని చూసి సాయి హుంకరించేడు. మరో నిమిషములో గంగాధరునికి పట్టుకున్న రోగం మటుమాయమైంది.

సద్గురు సాయి భక్తురాలైన రాధాకృష్ణమాయి విషయంలోనూ సాయి అలానే చేసేడు. ఆమెను పట్టి పీడించే సైతాన్‌ను గుర్తించి, గట్టిగా హుంకరిస్తూ, గదమాయించేసరికి, సైతాను మరి కన్పించలేదు. తన యొక్క భక్తులెంతటి ఆపదలో ఉన్నా తానే స్వయంగా వెళ్ళి వారి బాధల్ని తనదైన శైలిలో నివారించి వచ్చే భక్తవత్సలుడైన సాయిని ఏమని ఏమని కీర్తించగలం?

"యాంతి దేవవ్రతా దేవాన్ పితౄన్ యాంతి పితృవ్రతాః
భూతానియాంతి భూతేజ్యాయాంతి మద్యాజినోపి మామ్!!"
(గీత 9-25)

దేవతలను పూజించేవారు దేవలోకానికి, పితృదేవతల్ని పూజించేవారు పితృలోకానికి చేరుతారు. భూత, ప్రేతాలను పూజించేవారు ఆయా భూత,



ప్రేత రూపాలనే పొందుతారు. కాని... నన్ను నిరంతరం ఆరాధించే భక్తులు నన్నే పొందుతారు. అనగా చేరుకుంటారు. నా భక్తులకు పునర్జన్మ అనేదే ఉండదు, అంటూ అలనాడు శ్రీకృష్ణపరమాత్మ పలికిన పలుకులే సద్గురుడైన శ్రీసాయి కూడా చెప్తూండేవాడు.

"ఈ మసీదు మాయి ఎంతో దయగలది. తనను నమ్మి వచ్చే బిడ్డలను సదా కంటికి రెప్పలాగ కాపాడుకుంటుంది. ఈ తల్లిని ఎవరాశ్రయిస్తారో వారి కష్టాలన్నీ తీరిపోయినట్లే...." అంటూ ద్వారకామాయి గురించి చెప్తుండేవారు శ్రీసాయి. అంతేగాదు, మనం చేయబోయే, చేసే సమస్త కర్తవ్య, కర్మలను తనకే సమర్పించమని తనను శరణుజొచ్చితే అన్ని పాపాలనుండి విముక్తి గావిస్తానని ఆనాడు గీతాకారుడు నుడువినట్లే శ్రీసాయి గూడ భక్తుల నుద్దేశించి పలికిన పలుకులివి.

"నా భక్తుడింట లేమి యన్నది వుండదు. నా సమాధి నుంచే నా ఎముకలు మీ యొక్క ఆపదలను గట్టెక్కిస్తాయి." అంటూ సమాధి అనంతరం కూడా భక్తులను కాపాడుకుంటున్న శిరిడీ సాయిగూర్చి ఏమని చెప్పగలం?

చివరగా ఒక్క విషయం మనవి చేయదలచుకున్నాను.

ఈ సకల జగత్‌ను అధ్యాత్మికం చేసి, పాలించేవారు డెభైరెండు మంది విజ్ఞానసంపన్నులైన వారుంటే, వారికి అయిదుగురు గురువరేణ్యులున్నారు. ఆ అయిదుగురు గురువరేణ్యులలో సర్వశ్రేష్ఠుడు, మార్గదర్శి అయినవాడే శిరిడీసాయి. భక్తుల యొక్క సకలభారములను తానే మోస్తూ, వారి ఆపదలనుండి వారిని గట్టెక్కించే ఆ సహస్ర దళాక్షుడికి, సర్వమంగళమూర్తికి, అందరం కలిసి శిరస్సునుంచి పాదాభివందనం చేద్దాం.

జై సాయినాథా ! జై జై శిరిడీ సాయినాథా !!

# మనమెలా జీవించాలి ?

**ఆర్.కైలాసరావు, శ్రీషిర్డీసాయిసేవామందిరం, ఉప్పాడ - 533 448,**
**తూ.గో.జిల్లా, ఆం.ప్ర**

శ్రీసాయినాథుని శరణుపొందినవారు దుర్గుణాలు వదిలి సరియైన మార్గంలో నడవగలుగుతారు. బాబా పలుకులు : "నా భక్తులను శుభ్రమార్గంలో నడిపిస్తాను". ఆయన భక్తులెవరు? ఆయన ఆజ్ఞలన్నీ పూర్తిగా పాటించేవారే. బాబా భక్తులుగా మారాలనే కోరికతో తపించే వారికోసమే కాబోలు ఇది వ్రాయాలనే సంకల్పం నాలో శ్రీసాయి కలిగించారు. "చేయి నాది, భావాలు బాబావి" ఇదే సత్యం.

సాధకులు వదిలిపెట్టవలసినవి, అలవరచుకోవలసిన గుణాల గురించి శ్రీసాయి మనకర్థమయ్యేలా చెప్పారు. సాధనకు అవరోధాలయిన ధనాశ, స్త్రీవ్యామోహం, సుఖాలాలస, అనుచితప్రవర్తన మొదలైనవాటి గురించి, దైవం, ధర్మం, సత్యం, దయ మొదలైన దైవీ సంపద గురించి ఆయన సద్గురువై బోధించారు. శుభ్రం చేయబడని స్థానం పూజాపీఠంగా పనికిరానట్లే, శుద్ధికాని చిత్తం సాయిసేవకు పనికిరాదు. శ్రీసాయి అనుగ్రహాశీస్సులతో ఆయన దివ్యసందేశాలు మననం చేసుకొని, శుద్ధమనస్కులవుదాం.

ధనాన్ని ప్రోగుచేసినవాడు విషసర్పంగా మారి దానికి కాపలా కాస్తుంటాడని, ఆ ధనం ధర్మకార్యాలకు వినియోగించిన తర్వాతే మానవునిగా మారతాడని చిన్న కథరూపంలో సాయి చెప్పారు. పూర్వ సత్కర్మల ఫలితంగా



మనవద్దకు సంపద చేరుతుంది. అది తెలియక తన గొప్పతనమే సంపదకు కారణమని విర్రవీగుతాడు మానవుడు. గర్వం పెరుగుతుంది. దాన్ని ఇంకా పెంచడానికి, కాపాడటానికి ఇతరులకు హాని చేయటానికి కూడా వెనుకాడడు. ఇదే పాముగా మారడమంటే. "నన్ను సరిగా వినియోగిస్తే, నీకు చక్కగా సేవ చేస్తా"నంటుంది ధనం. ఇది సాయి సూక్తి. ఎవరైతే ధనాన్ని సక్రమంగా వినియోగపడకుండా చేస్తారో వారు పాము, కప్పవంటి నీచజన్మలు పొందుతారని వీరభద్రప్ప, చెన్నబసప్పల జీవితాలు చెపుతాయి. ధనాన్ని ధర్మకార్యాలకు వినియోగిస్తే ఉత్తమజన్మ పొందుతారని పై సూక్తుల భావం కావచ్చు. "రాజై వుండి కూడా బిచ్చగాని దుస్తులు ధరించగలవాడే మంచివాడు" ఇది సాయి బోధన. ధనవంతుడైనవాడు నిరాడంబరంగా, వినయంగా వుండాలని అంతరార్థం.

ధర్మబద్ధమయిన వివాహబంధం ద్వారా, భగవంతుని సంకల్పమయిన సృష్టికార్యానికి మాత్రమే స్త్రీ పురుష సంబంధం వినియోగించాలి. జంతువుల వలె వాంఛలు తీర్చుకోడానికి కాదు. శ్రీదత్తదర్శనంలో అత్రిమహాముని, అనసూయలు దీనిని తమ ప్రవర్తన ద్వారా చాటిచెప్పారు. కానీ నేడు పశువాంఛను పెంచే సాధనాలు అందుబాటులో వుండి మానవులను భ్రష్టుపట్టిస్తున్నాయి. మాతృదేవతగా, పతివ్రతగా, పుణ్యశీలగా పూజించబడిన భారతీయ వనితను అసభ్య వేషధారణతో, దుర్మార్గ వర్తమానురాలైన ప్రతినాయికగా (లేడీవిలన్‌గా), ఉద్రేకపరిచే నాట్య, నటనా దృశ్యాలలో చూపించడం, చూడటం మన నైతిక పతనానికి నిదర్శనం. దిగజారిన హిందూ సంస్కృతికి ప్రతిబింబం. "బాహ్యసౌందర్యాన్ని గాక లోపలున్న దైవాన్ని

చూడాలి". "స్త్రీలకు సాధువెంతో దూరండా వుండాలి" అన్న సాయి అమృతవాక్కులు సాయి భక్తులైనవారు ఆచరిస్తూ ఇతరులు ఆచరించేలా ప్రోత్సహించాలి.

మానవుడు సుఖాలకై పడే ఆరాటఫలితమే అంతులేని కోరికలు. వీటికి బానిసై అవి తీర్చుకోవడానికి చేసే కర్మలన్నీ దుఃఖకారణాలే. అనేక వక్రమార్గాలు, వాటితో అనర్థాలు, అంతులేని దుఃఖం. ఈ కోరికలకు తృప్తి అనేది వుండదు. క్రొత్తక్రొత్త కోరికలు పుడుతూనే వుంటాయి. అవసరమైనవి లభించగానే తృప్తి చెందాలి. "కావాలి అన్న కోరిక విడిచి, దైవంపై మనస్సు నిలపండి" అని సాయి చెప్పారు. దొరికిన దానితో సరిపెట్టుకోవాలి. ధాన్యం బస్తా రూపాయకు అమ్మే ఆ కాలంలో శ్రీసాయికి రోజుకు వచ్చే దక్షిణ రూ.500లు. ఏనాడైనా ఆయన దాచుకున్నాడా? భిక్షాన్నంతోటే సరిపెట్టుకున్నాడు. అంతా సాయంత్రానికి దానం చేసేసేవారు.

ఆహారం, నిద్ర విషయాలలో కూడా నియమం పాటించాలి. అతి నిద్ర ఎవరికైనా పనికిరాదు. అతి భోజనం హానికరం. మిత భోజనం ఆరోగ్యకరం. అభోజనం భయంకరం. ఇది పెద్దల నానుడి. బాబా చెప్పారు, **"మితంగా తిను, రుచులకు పోవద్దు. ఒకటిరెండు పదార్థాలతో సరిపెట్టుకో".** ఈనాటి వైద్యులు ఇదే విషయాన్ని చెపుతున్నారు. రుచికరమైన వస్తువులతో రోగ గుణం దాగివుంటుంది. అతి భోజనం తమోగుణానికి అంటే బద్ధకానికి, అజ్ఞానానికి దారితీస్తుంది. ఉపవాసం శక్తిహీనత కల్గించి మన విధులు నిర్వర్తించే శక్తిని తగ్గిస్తుంది. కనుక సాత్విక మితాహారం క్షేమకరం. ఋషులు అందువల్లే కందమూలాలే ఆహారంగా తీసుకొనేవారేమో. అతి నిద్ర సాధనా సమయాన్ని



మింగేస్తుంది. కనుక సాధన కుంటుపడుతుంది.

భగవంతుడు సృష్టించిన ప్రతి మానవునకు కర్తవ్యం నిర్ణయింపబడివుంటుంది. దానికి తగిన కర్మలు అంటే స్వధర్మం ఆచరించడం మన విధి. కాని వికృత ఆలోచనలతో కీర్తప్రతిష్ఠలనే మాయకు లోబడి స్వధర్మాలు విడిచి పరధర్మాలు ఆచరించడం చూస్తున్నాం" నిన్ను భగవంతుడెలా పుట్టించాడో అలాగే ఉండు" అన్న బాబా సూక్తిని అర్థంచేసుకోలేక ముళ్లదారులు పడుతున్నారు. రాజైన జనకుడు, మాంసం అమ్ముకునే ధర్మవ్యాధుడు, బోయవాడైన కన్నప్ప, మాలవాడైన నందుడు ముక్తి పొందలేదా ! వారి కులము, కర్మలు ఆటంకాలు కాలేదు కదా !

"నీవు ఒప్పుకున్న పని సక్రమంగా నిర్వర్తించు. లేకుంటే ఒప్పుకోకు". ఇది బాబా ఆజ్ఞ. అది పాటించకపోతే అది అసత్యమవుతుంది. నీ మనస్సును నీవే మోసగించుకోవడం అవుతుంది.

సమయాన్ని వ్యర్థంగా గడపరాదు. విందులు, వినోదాలు, కాలక్షేపానికి కబుర్లు మొదలైనవానితో కాలము ఖర్చుచేయకు. అది మళ్లీ తిరిగిరాదు. బాబా యీ విషయంలో ఎమన్నారు? సద్గ్రంథాలు చదువు. దైవ నామాన్ని ఉచ్ఛరించు. సత్సాంగత్యం వలన శాంతి సౌఖ్యాలు పొందుతావు. నలుగురితో చేరకు. ఎక్కువగా మాట్లాడకు. మాట్లాడేదానిలో ఎక్కువభాగం శ్రీసాయిని (భగవంతుని) గురించి కావాలి. వంటరిగా గడపటం మంచిది.

ఇద్దరు ఒకచోట చేరితే మూడవవ్యక్తి గురించి మాట్లాడటం జరుగుతు ఉంటుంది. ఇతరులను విమర్శించడం చాలా నీచం. దానిని పంది మలం తినటంతో పోల్చారు బాబా. దాని వల్ల వారి పాపం విమర్శించినవారికి

సంక్రమిస్తుంది. ఇతరులను మన ప్రవర్తనతోగాని, మాటలతోగాని బాధించరాదు. వారిలో కూడా శ్రీసాయే వున్నాడని గుర్తుంచుకో. "పంతాలు, కీచులాటలు మాను" అన్నారు బాబా. ఎదుటివారిలో సాయిని చూడగలిగితే పంతాలు, పోటీలు, కీచులాటలు వుండవు గదా ! అందరినీ శ్రీసాయిస్వరూపులుగా గుర్తించి గౌరవించగలవాడే నిజమైన సాయిభక్తుడు. ఆకలిగొన్నవారికి అన్నం, వస్త్రాలు లేనివారికి గుడ్డలు ఇయ్యి".

బాబా చెయ్యి కాలినప్పుడు నెయ్యి రాసి కట్టుకట్టాడు భాగోజీ. ఆ సేవను గాయం మానిన తర్వాత కూడా జీవితాంతం చేసాడు. బాబా నడిచే వీధులు తుడిచి, నీళ్లు చల్లి, ముగ్గువేసేపని జీవితాంతం చేసారు అబ్దుల్లా, రాధాకృష్ణమాయి. అలాగే సేవలు నీవు చేస్తున్నావా? కేవలం గురువారం 30ని॥లు సాయి సన్నిధిలో గడిపితే చాలా! అది సంవత్సరానికి ఒక రోజు కాలం, 30సం॥లకు 1 నెల కాలం అవుతుంది. అదే చాలా ! వీలయినంత సమయం భౌతిక ప్రపంచానికి దూరంగా సాయి సన్నిధిలో గడుపు.

పూజలు, వ్రతాలు, ఉపవాసాలు, యాత్రలు అక్కరలేదు. నా నామము జపించు. నా రూపం మనసులో నిలుపుకో అని శ్రీసాయి చెప్పారు. నిరంతరం సాయిని గూర్చి చదువుతూ, సాయిసేవ చేస్తూ, సాయి గురించే ఆలోచిస్తుంటే నీవే సాయిగా మారతావు. ఇదే శ్రీసాయి కోరేది.

సాయినాథుడే నాలోని జీవము, సాయి నామమే నాలోని ప్రాణము.

ఓం శ్రీ సాయిరాం



# నిజమైన ఫకీరు

రచన : **కొప్పిశెట్టి సూర్యనారాయణ,** పి.ధర్మవరం, విశాఖజిల్లా



ఎందరో మహాయోగులు, సిద్ధపురుషులు, తత్త్వజ్ఞానుల చరిత్రలను గురించి మనం చదవడం, వినడం జరిగింది. కాని సరియైన జ్ఞానంతో పరిశీలించి, ఆలోచిస్తే షిర్డీ సాయీశ్వరుని అవతార రహస్యం అందరికంటే, అన్ని విషయాలలోను, చాలా భిన్నంగా వుంటుంది. ఆయన అసలైన 'ఆత్మజ్ఞాని'గా తన జీవన విధానంతో అంతర్లీనంగా మనకు బోధించాడనే విషయం చాలా రహస్యంగానే సాగింది. వీరు ప్రపంచ చరిత్రలో అవతరించిన మహాత్ములందరిలో అగ్రగణ్యులు. ఈ విషయాన్ని శ్రీమెహర్‌బాబాయే ఇలా అన్నారు, "శ్రీసాయి విశ్వమంతటికీ గురువు అనదగినవారు" అని స్పష్టంగా చెప్పడం జరిగింది !

అసలు ఆయనలో 'సద్గురు' లక్షణాలున్నాయా? 'సద్గురువు' అంటే ఎవరు? అని మనం ఆలోచించుకోవాలి. ఎందుకంటే సద్గురుని మాత్రమే మనం ఆరాధించాలి. వేదాలు 'శ్రోత్రియుడు, బ్రహ్మనిష్ఠుడు అయినవారినే సేవించాలి" అని చెప్పాయి. శ్రీకృష్ణపరమాత్మ కూడా గీతలో 'తత్త్వదర్శినిని సేవించాలి' అన్నాడు. మన సాయీశ్వరుడు కూడా "నిజమైన ఫకీరు చాలా

అరుదు" అన్నారు.

అయితే నిజమైన గురువులు మనకు ఉపదేశాలు గాని, ఆత్మజ్ఞానాన్ని గాని ప్రత్యక్షంగా కలిగించరు అనే సత్యాన్ని ముందుగా గ్రహించాలి. సాయియే అన్నారు, "నా గురువు నాకేమీ ఉపదేశించలేదు" అని. సాయి సేవించిన తన గురువుగాని, మన సాయిగాని, అక్కల్‌కోటస్వామిగాని, రమణమహర్షిగాని తాము ఎవరినీ తమ శిష్యులుగా తలంచనూలేదు. చెప్పలేదు కూడా ! ఎందుకంటే వారు సర్వాన్నీ, అంటే సమస్త చరాచర ప్రాణకోటినీ ఆత్మగానే దర్శించారు.

సాయి అందర్నీ 'భావూ' (సోదరా!) అనీ, రమణమహర్షి మానవులనే కాదు ప్రతిజీవినీ 'వారు' అనీ అనేవారట! చూసారా ? 'ఆత్మ' అనే దానికి వారు ఇచ్చే గౌరవం !అందరూ ఒక్కటే అయినప్పుడు ఆ మహాయోగులు ఎవరికి ఏ మంత్రాన్ని ఉపదేశించగలరో ఆలోచించండి. అంతే కాదు. ఆధ్యాత్మ ప్రచారాన్ని గాని, శిష్యుల్ని సేకరించడం గానీ, గ్రంధరచన గాని, ఆలయ, మఠ, ఆశ్రమ నిర్మాణ, నిర్వహణగాని చేయరు! సాయినాథుడు పైన చెప్పినవేవీ చేయలేదని మనకు తెలిసిందే. సాయి ఒకసారి "నా శిష్యుడు అనదగినవారెవరూ ఇంత వరకూ లేరు" అన్నారు. దీంట్లో ఆయన ఉద్దేశ్యాన్ని మనం అర్థం చేసుకోవచ్చు. ఆయన మరోసారి "నా సేవ పూర్తయినట్లు, నాకు గుర్తేమిటి?" అన్న జోగ్‌తో "నీవు సర్వబంధాలు విడిచి, భిక్షమెత్తుతూ, నాలా జీవించడమే!" అనడంలో ఉద్దేశం ఏమిటి? ముముక్షువు అన్నీటినీ విడిచిపెట్టిన వానిగా ఉండి, తనను గురువుగా విశ్వసించి, ప్రేమమూర్తిగా ధ్యానించి సేవించాలి! అదీ కూడా సాయి తన గురువును సేవించినట్లుగా మాత్రమే సుమా ! దీంట్లో



ఉపదేశాలు, ఆత్మజ్ఞానబోధలు ఉండవు! వాటిని కోరకూడదు! స్వయంగా సంపాదించుకోవలసిందే !

ఇంతకీ నిజమైన గురువు లక్షణమేమిటంటే ఆయనే అందరినీ తన గురువుగా భావిస్తారు. అన్నీ ఆత్మలను తానుగా, తనలో అన్ని ఆత్మలున్నట్లుగా భావించే సద్గురువు ఎవరికి ఏం ఉపదేశిస్తాడు? అందుకే మన సాయి "తనను ఆశ్రయించినవారి బాధలను తానే భరిస్తూ, కాళ్లు కూడా పట్టుతూ, 'ఇది తప్పు' అనే వారితో "నీవు, నేనూ అందరం ఒక్కటేలే ? ఇందులో తప్పేముంది?" అనడంలో ఆంతర్యం ఇదే !

ఈగ, దోమ, పిల్లి, కుక్క, క్రిమికీటకాదులు ముట్టినవాటిని ఆరోగ్యరీత్యా మనం తినముకదా ! మరి ఆయనకు ఈ భేదమే లేదు. 'ఎంగిలి' అని కూడా ఆలోచించకుండా, వాటికిపెట్టి, మిగతాది ఆనందంగా తినేవారంటే, ఇలాంటి మహాత్ములగురించి మనం విన్నామా? **సర్వజీవుల్నీ పరమాత్మ స్వరూపంగా భావించడం ఆయనకే చెల్లింది!**

భగవద్గీతలో "సర్వభూతస్థమాత్మానం ! సర్వ భూతానిచాత్మని ! ఈక్షతే యోగ యుక్తాత్మా! సర్వత్ర సమదర్శనః ॥" అన్నాడు శ్రీకృష్ణపరమాత్మ. చూసారా? "పరిశుద్ధమైన జీవాత్మలన్నీ నిజానికి ఒకే ఆకారంతో ఉంటాయి. యోగాభ్యాసం చేత తన ఆత్మను సర్వజీవాత్మలతో సమానంగానూ, సర్వప్రాణులను తన ఆత్మతో సమానమైనవిగానూ చూచేవాడు ఎవరోకాదు, నేనే" అని చెప్పిన మాటల్ని బట్టి ఈ సాయి ఎవరో మనకు అవగతమైంది గదా !

ఇక్కడ లోకంలో మనం చూస్తున్న ఒక్క విషయాన్ని కూడా మనం జ్ఞాపకం తెచ్చుకోవాలి. ఒక మనిషి తాను బ్రతికిన జీవితకాలంలో

రాగద్వేషాదులకు లోనై (మనస్సువల్ల) ఎన్నో దుష్కార్యాలు చేసినా దుష్టుడైనా మరణించిన పిదప, వాటినన్నింటినీ మరచి, అందరూ అతనికి నమస్కరిస్తూంటారు. ఆ నమస్కారాలు ఆతని భౌతిక కాయానికి కాదు ! అతని యొక్క పరిశుద్ధమైన ఆత్మ పరమాత్మను చేరుచున్నదనే గౌరవంతోనే గదా ! 'ఆత్మ' అనేది దానికున్న పరమార్థం అదే నన్న మాట !

సాయి తత్త్వాన్ని పూర్తిగా అర్థంచేసుకున్న ఏ భక్తుడూ ఆయనను సామాన్యయోగిగా తలంపడు. ఆయన ప్రతి విషయాన్ని ప్రత్యక్షంగా బోధించడం చాలా తక్కువ ! ఆయన కొన్ని సంకేతాలతో మనల్ని పాటించమని ధ్వనింపజేయడమే ఆయన ప్రత్యేకత ! ఆయన ఆత్మబోధలు చేయకపోయినా కొన్ని సందర్భాలలో సామాన్యమిత్రునిగా లోకసహజమైన రీతిలో అక్కడక్కడా చేసిన కొన్ని హితవాక్యాలను బట్టి తేలిందేమిటంటే, ముఖ్యంగా మన మనస్సులో ఎవర్ని అయితే నిల్పుకున్నామో ఆతనియందు సంపూర్ణ విశ్వాసం ఉండాలి. రెండవది ఆత్మార్పణ అంటే ఇంక 'నేను' 'నాది' అనేది ఏదీ లేదు. అన్నీ నీవే! అంతా నాదే అనేటటువంటి నిశ్చలత అవసరం ! అటువంటి మహత్తర ప్రవర్తన కలిగి, సర్వవిధాలా, సర్వవేళలా సర్వజీవకోటిని సంరక్షిస్తున్న సాయినాథునికి మనం అర్పించవలసినవి – నిష్ఠ, సబూరీ మాత్రమే !

ఆయన రూపాన్ని మనం దర్శించడం అంటే ప్రతివస్తువు, ప్రతిజీవి, ప్రతి కార్యసిద్ధి వీటిలో మనం ఆయన్ని దర్శించడం అన్న మాట! అన్నిటిలో ఆయన ఉనికి మనకు గోచరిస్తూనే ఉంటుంటే మనకు ఆయన దర్శనభాగ్యం కలుగుతున్నట్లే ! ఇంతకన్న జన్మ సాఫల్యత ఇంకేమున్నది !

కాబట్టి సకల సద్గురు లక్షణాలతో విరాజిల్లే సాయినాథుని అవతారం



జరిగిన పుణ్యభూమి షిరిడీ ప్రాంతం కాబట్టి కాశీ, తిరుపతి వంటి మహాపుణ్యక్షేత్రమై, సర్వమతాలవారికి సమ్మతమైన శాంతి క్షేత్రంగా ప్రసిద్ధి చెంది ఆశ్రిత కల్పవృక్షమై దీవించుచున్నది, తరింపజేస్తున్నది. సాయి నిజమైన ఫకీరని తెలుపుచున్నది.

**తే॥ గీ ॥ నిజమయిన ఫకీ రతడంచు బ్రజలు నమ్మి,**
**సకల భోగప్రదాతయౌ సాయిఁ గొల్వ,**
**పరమగమ్యమౌ శాంతిని పంచుచున్న**
**పుణ్యతీర్థాల సర్వార్థ గణ్య షిరిడీ !**

ఓం తత్‌సత్

## చందాదారులకు మనవి

శ్రీసాయిదర్శన్‌ను ఏప్రియల్ 2008 నుండి ఎక్కువ పేజీలు, టైటిల్ ఆర్టుపేపరుపై ముద్రించి సాయిబంధువులకు అందిస్తున్నాము. అందువల్ల అదనంగా ఖర్చు భరించవలసి వస్తుంది. అందుకొరకు పత్రిక చందా పెంచకుండా మీకు అందుబాటులోనే 'శ్రీసాయిదర్శన్' మీ ఇంటికి పంపుట జరుచున్నది. ప్రతి చందాదారు శ్రీసాయిదర్శన్‌కు ముగ్గురు సభ్యులను చేర్పించి, ఉచిత కానుక పొందగోరుచున్నాము. బంధుమిత్రులను సభ్యులుగా చేర్చుటగాని, లేదా బంధువుల పేర మీరు చందా చెల్లించిన వారికి మీ కానుకగా పంపుచున్నట్లు ఉత్తరం ద్వారా వారికి తెలియపరచగలం.

శ్రీసాయి ప్రబోధ ప్రచారమునకు మీ సహాయ సహకారములు అందించి శ్రీసాయినాథుని కృపాకటాక్షములకు పాత్రులు కండి.

– **రావూజీ,** ఎడిటర్

# విభూతి యోగము

**శ్రీశంబాన నారాయణరావు,** డోర్ నెం. 9-2/3, హాస్పటల్ రోడ్,
బొబ్బిలి - 535 558, విజయనగరం



**వేదానాం సామవేదోஉస్మి దేవానాం అస్మి వాసవః ।
ఇంద్రియాణాం మనశ్చాస్మి భూతానాం అస్మి చేతనా ॥ (22)**

(నేను (భగవంతుడు) వేదములలో సామవేదమును, దేవతలలో ఇంద్రుడను, ఇంద్రియములలో మనస్సును, ప్రాణులలో చైతన్యమును (తెలివి) అయియున్నాను.)

1. తమ మాటపై శ్రద్ధగల అర్జునుని ఆదరించి శ్రేష్ఠమైన వాక్యములను చెప్తానంటాడు శ్రీకృష్ణుడు.
2. నా అవతార రహస్యం దేవగణాలకుగాని, మహర్షులకుగాని తెలియదు.
3. ఎవరు నన్ను పుట్టుకలేని వానిగను, సమస్త లోకాలకు ప్రభువుగా తెలిసికొందురో వారు పాపముల నుండి విముక్తిని పొందగలరు.
4. బుద్ధి, జ్ఞానము, ఓర్పు, సత్యము, సుఖము, దుఃఖము, పుట్టుట, నాశము, తపస్సు, దానము మొదలగు గుణములు ప్రాణులకు నావలననే కలుగుచున్నవి.
5. లోకమందు వున్న ప్రజలు ఎవరి సంతతియై యున్నారో అట్టి సప్తమహర్షులు, సనకాదులు, మనువులు నావలననే పుట్టిరి.





6. నా యొక్క విభూతిని (ఐశ్వర్యమును) నిజముగా తెలిసికొనిన వాడికి యోగసిద్ధి కలుగును.
7. ఎవరు నాకొరకు ప్రాణములర్పించుదురో, నాయందే మనస్సు నుంచి నన్ను భజించుచుందురో అట్టివారి హృదయంలో వుండి జ్ఞానమును కలుగజేసి, అజ్ఞానమనే చీకటిని నశింపజేస్తాను అంటాడు శ్రీకృష్ణుడు.
8. శ్రీబాబా ఏమన్నారంటే..........

   "ఎవరు నన్ను ఎక్కువగా ప్రేమించెదరో వారు ఎల్లప్పుడు నన్ను దర్శించెదరు. నేను లేకపోతే వారికీ జగత్తు శూన్యం. వారు నా కథలనే ఎల్లప్పుడు చెప్పెదరు. నన్నే ధ్యానించెదరు. నిరంతరం నా నామమును జపిస్తూ సర్వస్య శరణాగతి చేయుదురు. అట్టి వారికి నేను ఋణగ్రస్తుడను. వారికి మోక్షమును యిచ్చి వారి ఋణం తీర్చుకొందును."
9. గీతనుండి.....

   "కృష్ణా ! మీరు పరబ్రహ్మయని, పరమపావనరూపుడని, శాశ్వతుడని, సర్వవ్యాపియని, ఋషులందరు చెప్పినట్లే మీరు నాకు చెప్పుచున్నారు. మీ నిజస్వరూపం దేవతలకుగాని, రాక్షసులకుగాని తెలియదు. మిమ్ము తెలిసినవారు లోకములన్నింటిని వ్యాపించుటకు కారణమగు విభూతులను, మిమ్ము తెలిసి కొనుటకు ఏ విధంగా, ఏ వస్తువు లందు ధ్యానించాలో చెప్పినట్లయితే తనవితీర వినెదనని" అర్జునుడు శ్రీకృష్ణుని ప్రార్థిస్తాడు.

10. అంతులేని విభూతులలో ముఖ్యమైన వాటిని మాత్రమే చెప్తానంటాడు శ్రీకృష్ణుడు.

11. సమస్త ప్రాణుల ఆత్మను, సృష్టి,స్థితి,లయ కారకుడను, ఆదిత్యులలో విష్ణువును, ప్రకాశింపజేయు కిరణాలను గల సూర్యుడను, నక్షత్రాలలో చంద్రుడను, వేదములలో సామవేదమును, దేవతలలో ఇంద్రుడను, ఇంద్రియాలలో మనస్సును, భూతాలలో చైతన్యాన్ని, రుద్రులలో శంకరుడను, పర్వతాలలో మేరువును, పురోహితులలో బృహస్పతిని, సేనానాయకులలో కుమారస్వామిని, సరస్సులలో సముద్రమును, మహర్షులలో భృగుమహర్షిని, మాటలలో 'ఓం'కారమును, కదలని పదార్థములలో హిమాలయ పర్వతాన్ని, చెట్లులన్నింటిలో రావిచెట్టును, దేవర్షులలో నారదుడను, సిద్ధులలో కపిలమునిని, రాక్షసులలో ప్రహ్లాదుడను, మృగాలలో సింహాన్ని, పక్షులలో గరుత్మంతుడను, నదులలో గంగానదిని, అక్షరాలలో 'అ'కారాన్ని, నాశనంలేని కాలాన్ని, అన్ని దిక్కులకు ముఖాలు కలిగిన బ్రహ్మను, ఛందస్సులో గాయత్రిని, మాసాలలో మార్గశిరాన్ని, ఋతువులలో వసంతాన్ని, మృత్యువును, మాటను, జగత్తులో శ్రేష్ఠమైన ప్రతీదీ నేనేనంటాడు శ్రీకృష్ణుడు. ఈ సమస్త జగత్తు నాలో ఒకే ఒక అంశంతో నిండి వున్నాయి అంటాడు శ్రీకృష్ణుడు.

12. శ్రీబాబా ఏమ్మన్నారంటే....

"ప్రపంచంలో చరాచర జీవరాశులను, జడాజడపదార్థములను ఆవరించియున్నాను". ఎట్లనగా :

ఆత్మారామ్ తర్ఖడ్ భార్య శిరిడీ వెళ్ళి ఒకరి యింటిలో వుంటుంది. మధ్యాహ్నం భోజనాల సమయంలో ఆకలితో ఒక కుక్క వచ్చి అరుస్తుంది.



తర్ఖడ్ భార్య ఆ కుక్కకు రొట్టె పెట్టెను. అది ఎంతో ఇష్టంగా తిని వెళ్ళిపోయెను. సాయంకాలం ఆమె మశీదుకి వెళ్ళగా బాబా ఇట్లా అంటారు. "తల్లీ ! నాకు కడుపు నిండా భోజనం పెట్టినావు. నా జీవశక్తులు సంతోషించినవి. ఎల్లప్పుడు ఈ విధముగానే చేయుము. నీకు సద్గతి కలుగుతుంది. మొదట ఆకలితో నున్నజీవికి భోజనం పెట్టు. ఆ తరువాతే నీవు భోజనం చేయుము. ఈ పద్ధతిని పాటించుము." బాబాకు భోజనం ఎప్పుడు పెట్టితినా అని ఆలోచనలో పడుతుంది. మధ్యాహ్నం భోజన సమయంలో ఏ కుక్కకు రొట్టెముక్క పెట్టితివో ఆ కుక్క నేను ఒకటే అంటారు బాబా. అంటే "పిల్లులు, పందులు, ఈగలు, ఆవులు మొదలగునవి నా అంశాలే. నేను వాని ఆకారంలో తిరుగుతూ ఉంటాను. **ఎవరయితే సకల జీవకోటిలో నన్ను చూడగల్గుదురో వారే నా ప్రియ భక్తులు" అని అంటారు బాబా.**

13. మరొక సంఘటన :

కాకామహాజని తన స్నేహితుని శిరిడీకి రమ్మంటాడు. బాబాకు నమస్కరించను, దక్షిణ ఈయనంటూ షరతులు పెడతాడు ఆ స్నేహితుడు. దానికి సరే అంటాడు మహాజని. వారు శిరిడీ చేరుతారు. దూరంగా ఉన్న మహాజని స్నేహితుని, మంచిమాటలతో ఆహ్వానిస్తారు బాబా. ఆ కంఠ ధ్వని గతించిన తన తండ్రి కంఠధ్వని వలె ఉంటుంది. తన షరతులు తానే మరచి, బాబా పాదాలకు నమస్కరిస్తాడు ఆ స్నేహితుడు. ప్రతిమాట నేనే అని గీతలో శ్రీకృష్ణుడు అనిని దానిని, మహాజని స్నేహితుని తండ్రి మాట నాదే అని బాబా ఆచరణలో చూపించిరి.

14. మనలో కొందరు సాటి వారినే కాకుండా, ప్రతిజీవిని హింసిస్తారు. కోళ్ల

పందేలను, పొటేళ్ళ పోట్లాటలను చూసి ఎగిరి గంతులు వేసి ఆనందించేవారూ వున్నారు. ఒకరింకొకరిని చంపి సంతోషించేవారూ వున్నారు. వీరు ప్రతిజీవిలో ఉన్న భగవంతుని బాధపెట్టిన వారవుతారు. ఉపవాసం చేసి శరీరమును బాధపెడితే శరీరంలో ఉన్న 'ఆత్మ'ను బాధపెట్టినట్లే. మన ఆత్మకు పరమాత్మకు తేడా లేదు. అందువలన ప్రతిజీవిని ప్రేమించి, సమభావంతో చూడాలి. అట్లా చేయుటవలన భగవంతుని భజించినట్లే అవుతుంది. అందుకే బాబా అంటారు, "ఎవరయితే యితరులను నిందించుదురో వారు నన్ను హింసించినవారగుదురు."

సద్గురు సాయి పాదుకార్పితమస్తు

శుభం భవతు

# కుండలినీ శక్తి

ప్రతి స్త్రీ పురుషునిలోనూ ఒక ఆధ్యాత్మిక శక్తి వున్నది. ఈ శక్తి పరబ్రహ్మస్వరూపిణి. ఈ శక్తినే 'కుండలినీ' అంటారు. ఈ శక్తి మూలాధార పద్మగర్భములో తామరతూడును పోలివుంటుంది. గుండ్రముగా చుట్టుకొని వుండి బంగారువన్నె కలిగివుంటుంది. ఈ శక్తే స్త్రీ, పురుషులలోను జీవరూపిణిశక్తిగా 'ప్రాణరూపము'లో వుంటుంది. కుండలినీ శక్తి జాగృతమైతే తనలోని ప్రతి నాడిలో అపరిశుభ్రము పరిశుభ్రమై నాడులన్నింటిని ప్రభావితము చేస్తుంది.

సద్గురువు తన శక్తిపాతములో శిష్యునిలో పేద, గొప్ప, ఆస్తి, అంతస్తులు, ఆరోగ్యులా, అనారోగ్యులా అన్నది చూడదు. శ్రీగురుకృపచేత శిష్యునిలో ప్రవేశపెట్టబడిన శక్తి ఎలా పనిచేస్తుందంటే పరమాత్మ యొక్క శక్తి అనేక రకాలుగా పనిచేస్తుంది.



('సాయిభక్తమాల' అను గ్రంథము నుండి .... )

# 7. బాలకృష్ణ విశ్వనాథ దేవ్ (బి.వి.దేవ్)

**చరణ్ జనమంచి**

*(గత సంచిక తరువాత భాగం)*

| | | |
|---|---|---|
| అసలు పేరు | : | బాలకృష్ణవిశ్వనాథ్ దేవ్ |
| పిలవబడిన పేరు | : | భావ్ |
| వృత్తి | : | మమలతదారు |
| బాబాను దర్శించిన సం॥ | : | 1910 |
| మరణం | : | 01-01-1946 |
| పరిచయం చేసినవారు | : | నానాసాహెబ్ చందోర్కర్ |

నానాసాహెబ్ చందోర్కర్ పలుమార్లు ప్రేరేపించుటవలన 1910లో దేవ్ బాబా దర్శనార్థం షిరిడీ వెళ్ళెను. మొదటి దర్శనంతో బాబాపై అతనికి భక్తి,విశ్వాసం కలిగెను.

దేవ్‌కు మరాఠీభాషలో ఆధ్యాత్మిక గ్రంథములు చదివిన అనుభవం కలదు. కాని జ్ఞానేశ్వరిని నిత్యపారాయణ చేయలేకుండెను. అది ప్రారంభించు ప్రతిసారి ఏవో ఆటంకములు వచ్చుచుండెను. దానితో మనసు కలత చెందుచుండెను. షిరిడీకి దేవు వెళ్లిన కారణం, బాబా దయతో జ్ఞానేశ్వరిని చదువుటకు అనుమతి ఇచ్చెదరని కాని బాబా జ్ఞానేశ్వరి గూర్చి ఏమీ పలుకలేదు.



కొన్ని రోజుల తరువాత మరియొకసారి జ్ఞానేశ్వరి గ్రంథం తీసుకొని దేవ్ షిరిడీకి వెళ్ళెను. సాయినాథునకు నమస్కరించి జ్ఞానేశ్వరి గ్రంథంతో పాటు ఒక రూపాయి బాబాకు ఇచ్చెను. బాబా **"ఒక రూపాయి కాదు. రూ.20/-లు దక్షిణగా ఇమ్ము"** అని దేవ్‌ను అడిగెను. కాని జ్ఞానేశ్వరి గూర్చి మాట్లాడలేదు.

దేవ్ బాలకరాం మాన్‌కర్‌ను బాబా అనుగ్రహం ఎట్లుపొందెనో అడుగగా బాలకరాం మరునాడు తెలిపెదననెను. మరురోజు బాబా దేవ్‌ను రూ.20/-లు దక్షిణగా అడిగి, మాన్‌కర్‌తో ఏమి మాట్లాడుతుంటివి అని అడుగగా మీ గొప్పతనము లీలలు గూర్చి మాట్లాడుచున్నాము అనెను. సాయిబాబా రూ.25/-లు దక్షిణగా మళ్ళీ అడుగగా దేవ్ ఇచ్చెను. ఇంతలో బాబా **"పాతగుడ్డపీలికలేల దొంగిలించావు? తలనెఱసిన ముసలివాడు చేయవలసిన పని ఇదేనా? ఆ గొడ్డలితో నిన్ను వధింతును"** అని గట్టిగా అరిచెను. దేవ్ భయపడెను. 10 ని॥లలో బాబా కోపం తగ్గి దేవ్‌ను "వెళ్ళిపో" అనెను. గంట తరువాత మళ్లీ పిలిపించి దేవ్‌ను ఉద్దేశించి **" బావు! గుడ్డపీలిక అని నీ మనసు బాధపెట్టానా ? ఏదైనా సూటిగా మాట్లాడాలి.** భగవంతుడు అన్ని ఏర్పాట్లు సరిచేయును" అని పలికి రూ.12/-లు దక్షిణగా అడిగి 'జ్ఞానేశ్వరి'ని చదువమని ఆజ్ఞాపించెను. జ్ఞానేశ్వరిని చదివినా అందలి అంతరార్థం దేవునకు బోధపడలేదు. 02-04-1914నాడు బాబా స్వప్నదర్శనమిచ్చి **"జ్ఞానేశ్వరిని వేగముగా చదువుతున్నావు. అప్పుడు నీకది



ఎలా బోధపడును? నా ముందర చదువుము"** అని బాబా అన్న వెంటనే దేవ్ కళ్లు తెరిచెను.

బి.వి.దేవ్ దక్షిణ గూర్చి తన అనుభవాన్ని ఈ రకంగా వెల్లడించాడు. బాబా అందరిని దక్షిణ అడిగేవారు కాదు. అడక్కుండా ఇస్తే ఒకసారి తీసుకునేవారు, మరొకసారి నిరాకరించేవారు. వచ్చిన ఆ డబ్బును కొంత చిలుముకు, ధునికి ఖర్చు పెట్టి మిగిలిన డబ్బును దానం చేసేవారు.

ఒకసారి దేవ్ తల్లిగారు 30 దాకా నోములు నోచెను. వాని ఉద్యాపన చేయవలసియుండెను. ఆ సందర్భముగా బ్రాహ్మణులకు భోజనం పెట్టదలచెను. అందులకు అన్ని ఏర్పాట్లు చేసుకొని, బాపూసాహెబు జోగ్‌కు లేఖ వ్రాసి, అందులో సాయిబాబాను ఆ కార్యానికి రావల్సిందిగా విధేయతతో అడిగెను. అందుకు బాబా సంతోషించి **"నాయందు ఎవరికి దృష్టికలదో వారిని నేను సదా కాపాడుతాను"** అని ఆ కార్యానికి, తనేగాక మరొక ఇద్దరితో వస్తానని, జోగ్ ద్వారా దేవ్‌కు బాబా లేఖ వ్రాయించెను.

పైకార్యమునకు ముందు, బెంగాలీ దుస్తులతో ఒక సన్యాసి దహానులో, గోసంరక్షణకై చందా వసూలు కోసం స్టేషను మాష్టరును సంప్రదించగా వారు మమలతదారుయైన దేవ్ దగ్గరకు పంపిరి. దేవ్ వారితో ప్రస్తుతం ఊరిలో వేరొకటి చందాపట్టినడుస్తున్నదని మరో రెండు మాసాల పిమ్మట రమ్మనెను.

ఆ సన్యాసి సరిగ్గా అన్నసంతర్పణ జరుగు రోజున టాంగాలో దేవ్ ఇంటికి వెళ్లెను . ఆ సన్యాసిని చూసి దేవ్ ఏదో అనబోతుండగా, తాను

భోజనానికి  వచ్చానని, చందా కోసం కాదు అని సన్యాసి అనెను. సన్యాసిని ఎంతో ఆదరణతో దేవ్ లోపలికి తీసుకువెళ్లెను.  సన్యాసి తాను కాక మరో ఇద్దరు తనతో వచ్చారని, తాను వారితో కలిసి  12 గంటలకు భోజనానికి వచ్చెదను అనెను. అన్నట్లుగానే వచ్చి తిని వెళ్లిపోయెను.

దేవు జోగ్‌కు  ఒకలేఖ వ్రాస్తూ అందులో బాబా రానందున బాధగా ఉన్నది అనెను. ఆ లేఖతో జోగ్ మసీదు వెళ్లగా, బాబా కోపంతో, నేను మరో ఇద్దరితో  వస్తానని  అటులనే  వెళ్ళానని,  దేవు  గుర్తు  పట్టకపోగా నిందవేయుచున్నాడని  అనెను. ఆ రోజు సన్యాసిరూపమున వచ్చి భోజనం చేసిన ఆ అతిథియే సాయిబాబా అని తను గుర్తించనందుకు దేవ్  మిక్కిలి పశ్చాత్తాపపడెను. తన తప్పునకు బాబాను క్షమాపణ కోరెను .

బి.వి.దేవ్  సాయిబాబా  సమాధి  అనంతరం  శ్రీసాయిసంస్థాన్ సేవలోనే తన జీవితం గడిపెను.బి.వి.దేవ్‌కున్న భాషా ప్రావీణ్యంచే 'సాయిలీల మాసిక్'  పత్రికలో  ఎన్నో  వ్యాసములు,  శీర్షికలు  షిరిడీగూర్చి,  అందులో వెలసిన  సాయిబాబా  గూర్చి  ఎంతో  చక్కగా  వర్ణిస్తూ,   సాయిభక్తులకు తెలియజేసెను.  అందులో  తన  పేరుకు  బదులు  **'బాబా  కే  బాల్'  (బాబా యొక్క బిడ్డ) అని రాసెను.**

దేవ్  బాబా  గూర్చి  ప్రశ్నలడుగు  ఎందరో  భక్తులకు  ఎంతో సహనంతో సమాధానం చెప్పేవాడు. హేమాడ్‌పంత్ వ్రాసిన సాయిసచ్చరిత్ర గ్రంథంలోని అవతరణిక అను 53వ అధ్యాయమును, సాయిబాబాపై తన భక్తి నిరూపణకై సాయిబాబా ఆరతులలోని ఒక ఆరతిని బి.వి.దేవ్ రచించెను.



# సాయిస్వరూపం

శ్రీమతి పర్వతం రేవతీ ప్రసాద్, ప్లాటు నెం.115, డిఫెన్స్‌కాలనీ, సైనికపురి, సికింద్రాబాద్ - 500 094, ఫోన్ : 040-27113964



నీవే సత్యము సాయీశా - నీవే సకలం షిరిడీశా ।
నాయను వారలు లే రెవరు - నా బంధు మిత్రులు నీవేనయా ।
॥ నీవే ॥

2. చూడగ శత్రువు నాకు నేనయా - నీ కన్నా గతి నా కెవరయా ।
ప్రపంచమను ఈ సంద్రమందున - నావను నడిపే దైవము నీవయ । ॥ నీవే ॥

3. అనంత విశ్వము నావరించిన - సర్వాంతర్యామివి నీవేనయా ।
అనాది నిత్యుడు పురాణ పురుషుడు శ్రద్ధామయుడు నీవేనయా ।  ॥ నీవే ॥

4. పరమపూజ్యమగు దివ్యప్రేమగల - సాయీ నీ రూపు గాంచితిని ।
కాంతివంతము నీ స్వరూపము - వర్ణించుటకు వాక్కున కందవు । ॥ నీవే ॥

5. మానవ రూపాన పరబ్రహ్మమే - అవతరించెనని తెలుసుకొంటిని ।
నీ నామ మంత్రము వీడకుండా - సతతము నినునే భజింతుగాక । ॥ నీవే ॥

ఓం సాయి శ్రీ సాయి జయ జయ సాయి ।
ఓం సాయి శ్రీసాయి జయ జయ సాయి ॥

# శ్రీసాయినాథ్ భజనమాల

మూలము :శ్రీరఘునాథ్ , శ్రీమతి సావిత్రి బాయి టెండూల్కర్‌దంపతులు
తెలుగుఅనువాదం : శ్రీ రెంటాల విశ్వేశ్వరరావు, శ్రీమతి ఇందిరా కస్తూరి,
నరసారావుపేట, గుంటూరుజిల్లా



(21) ప్రాతఃకాలమున సాయి ప్రభువు యొక్క ముఖారవిందమును తిలకించి నమస్కరింతును. తరువాతనే ప్రాపంచిక విషయములలో చిక్కుకొందును. బాబా ! అయినను నేను నిన్ను మరువను. తల్లి తన బిడ్డకు కావలసినవి సమకూర్చినట్లే నీవును నన్ను ఆదుకొనుము.

(22) ఓ సాయీ ! నీ సేవచేయు భాగ్యము ప్రసాదించి, నా జీవితము ధన్యమగునట్లు చేయుము. నామనస్సెరిగి సర్వభూతముల యందును సమదృష్టి, దయలను ప్రసాదింపుము. నా మనస్సు ప్రేమతో నిండునట్లుగాను, భక్తిభావన రోజురోజుకు పెరుగునట్లుగను నన్ను అనుగ్రహింపుము. నీ పవిత్రనామస్మరణ జేయువారిని పాపములంటవు కదా!

(23) నీవు ఎప్పుడు వత్తువో అని నా కండ్లలో వత్తులు వేసుకొని చూచుచున్నాను. దేవా ! నీ స్మరణ తప్ప అన్యమెరుగని నాకు మనశ్శాంతి



ఎక్కడిది? నీవు నేననుకొన్నంత సులభుడవు, భక్తవశీకరుడవు కావేమో? దూరమున జరుగు ఉత్సవమును గాంచి, నేను సంతోషించుటయే గాని, నాకు నీ దర్శనము కలుగజేయలేవా ప్రభూ !

(24) నా సాయి నివసించే చోట ప్రేమామృతము ప్రవహిస్తూ, వైకుంఠమును మరిపిస్తుంది. దానికి సాయియే ప్రభువు, పాలకుడు, జగన్మాతృరూపధారి మరియు శీఘ్రమోక్షప్రదాత. సాయినామ సంకీర్తనమే మూర్తిదాయకము ప్రభూ ! తనువు, మనస్సు అర్పణచేసినవారిని నీవు వదులుకొందువా? మోహము, మాయ మొదలగువాటిని దూరము చేయగల సమర్థుడవు. సాధనాగమ్యము, సాధ్యములు నావంటి సాధకునకు అన్నియు నీవే కదా ?

(25) సగుణుడవైన శ్రీ సాయీ! నీ కమనీయ రూపమును కనులారా గాంచితిని, మనసారా ధ్యానించితిని. నిశ్చలమైన బుద్ధి, దృఢచిత్తము పొందిన నామనస్సిప్పుడు నీ నామస్మరణయందు లగ్నమైపోయింది.

(26) నీవు బసచేసిన షిర్డీనగరము నీ నామసంకీర్తనలచే ఉషఃకాలము నుండియే ప్రతిధ్వనించుచూ, ధన్యమైనది. సాధుపుంగవులు, సత్సంగులూ, సర్వసంగపరిత్యాగులూ, అచటనే గదా ఉందురు? పదండి ! మనము కూడ ప్రాణములకు ప్రాణమైన గురువులకు గురువైన సాయిదేవుని దర్శించెదము. ఆ దివ్యమంగళవిగ్రహమును కనులవిందుగా కాంచెదము రండని ఈ దాసుడు మనవి చేయుచున్నాడు.

(27) సాయినాథా ! భిన్న మనఃప్రవృత్తులు కలవారు తమ ఇష్టానుసారము నీ గుణగానమొనరించి, సేవ చేయుదురు. కొందరు పలు కష్టములను లెక్కచేయక, నిష్కళంకభక్తితో నిన్ను అర్చించుచున్నారు. కొందరు ఇహపరమైన ధనధాన్యముల కొరకు నీ పూజ చేయుచున్నారు. నీ యశోగాన కార్యములందు నా నాలుక ఎంత బలహీనమో నీవెరుగనిది కాదు. అయినను నేను నిన్నే ప్రేమతో స్తుతింతును.

(28) సోదర సోదరీమణులారా ! షిర్డీ గ్రామమున వేంచేసియున్న సాయీశ్వరుని అమృతనామము జపించుచూ, ఆయనను దర్శించుట కొరకు రండు. ఆ కమనీయ విగ్రహుని కాంచి అంతఃకరణముల యందు కృతార్థత పొందుదు. అది మనకు ఇహము, పరము – రెండును సులభతరము చేయును. ఆయన గురువులకు గురువు. నన్ను తరింపచేయ సమర్థులు. మీరును ఆ పవిత్రనామ జపముతో సాయిదేవుని కృపకు పాత్రులు కండి.

(29) ఓ భక్తాగ్రేసరులారా ! సాయినామమను కేతనమును చేబూని, మనమందరము కలిసిమెలసి చప్పట్లు చరచుచూ ఆయన నామామృతమును గ్రోలుదము రండు. ఆ నామ సంకీర్తన దశదిశల యందు మారుమ్రోగునట్లు చేసిన, సర్వవిఘ్నములు తొలగి మన జీవితములు సుఖమయములై వర్థిల్లును గాక.!

(30) మిత్రులారా ! సాయినామము జపించండి. అట్లు చేసిన జన్మజన్మల పాపములు పటాపంచలగును. సద్గురు సాయినాథా ! నీ చరణకమలముల యందు నతమస్తకుడైన నన్ను నీ బిడ్డవలె ఎంచి, నీ ఒడిలోనికి తీసుకొనుము.



నీవే నా తల్లివి, తండ్రివి, గురుడవు – సర్వము నీవే. నీవే నాకు దిక్కు.

(31) ఓ సాయీ ! నా హృదయమున బసచేసిన నీ కివే నా వందనములు. నీ సృష్టినిగాంచిన నా కత్యంత ఆశ్చర్యము కలుగుచున్నది. మోహము, లోభము వంటి అరిషడ్వర్గములు ప్రపంచమంతటను వ్యాపించియున్నవి. ప్రేమభావముతోను, సేవాదృక్పథముతోను నీ పూజ నాచరించెదను. నా జీవితమును సార్థకము చేయుము దేవా!

(32) బిగ్గరగా భగవన్నామస్మరణ చేసిన మాత్రమున చాలదు. అంతః కరణమున భగవంతుని ప్రతిష్ఠించు కోవలెను. కానిచో ప్రభు సాక్షాత్కారము దుర్లభము. పరనింద చేయనేల? ప్రతిఫలముగా తన్నులు తిననేల? ఓ మనసా! హృదయమునందు జాలి, ప్రేమ ఉండినప్పుడే సద్గురు సాయి సాన్నిధ్యము లభ్యమగునని ఈ దాసుని విన్నపము.

(33) సుఖశాంతులకు సాగరమువంటి ఓ దేవా ! తండ్రీ ! సాయినాథా ! నిన్నాశ్రయించిన వారికి భక్తి, ముక్తి ప్రసాదింతువు. అసంభవములను సంభవమొనర్తువు. ఈ విషయము అనుభవించినవారే చెప్పగలరు. కనుక ఓ మనస్సా ! ఓటమిని అంగీకరించి నీ యందు సద్గురు సాయిని నిలుపుకో !

(34) ఈ మానవశరీరము తీర్థక్షేత్రములకు, దేవీ, దేవతలకు, పాపపుణ్యములకు, సుఖదుఃఖములకు నిలయము. అయినను నరజన్మను పొందగలిగిన మనము ఉత్తములము, ధన్యులము. యోగులు, మునులు,

సాధుసత్పురుషులు మానవజన్మ ఎత్తియే గదా కృతార్థులైనది? జీవకారుణ్యము, జీవులయెడ సమభావము కలిగిన మానవులకు కృష్ణపరమాత్మ సాన్నిధ్యము లభించలేదా? గురువైన సాయి సత్పురుషుడు, దేవుడు కనుక ఆయనను శరణువేడమని ఈ దాసుని సలహా !

(35) సద్గురు సాయి మన మనోరథసిద్ధి కావించును. ఆయన ఏ రూపమున వచ్చి, ఏ కార్యమును చక్కదిద్దునో ఎఱుగజాలము కదా ! నిర్దేశ్యమైన స్థలములో మనము కన్నులవత్తులు వేసుకొని చూచుచుండినను మనకు కనిపించకయే కార్యములను చక్కబెట్టగల సమర్థుడా సద్గురువు. దీనిని స్వానుభవమున గ్రహించవలసినదే కాని, ఇతరత్రా అసంభవమని ఈ దాసురాలి విజ్ఞప్తి.

(36) ఓ మూఢమానవా ? 'నేను', 'నేన'ని విఱ్ఱవీగకుము. మాటలాడినంత సులభమా కార్యసాధనము? కార్యసాధన చేయజాలకపోయిన క్రియాభ్రష్టునిగా నీకు ముద్ర వేయుదురు. మాటలాడుటలో నీ చాకచక్యము ప్రదర్శింపకుము. కష్టముల పాలగుదువు. జాగ్రత్త ! సద్గురు పాదముల నమ్మి భజించుము. అన్నికార్యములు చక్కబడును. ఇదియే పరమ రహస్యమని గ్రహించుము.

(37) ఓ మానవా ! నీ అంతరంగమున గురు సాయిబాబా కొఱకై వెదకుము. అజ్ఞానాంధకారమునుండి బయల్పడవలెనన్న నీ అంతర్నేత్రములు తెరచుకొనవలెను. అపుడు బాబా యొక్క విభూతిని గాంచగలవు. ఆత్మార్పణతో ఆయనను ధ్యానించి, ఆయన సాన్నిధ్యమును చేరుటెట్లో ఎరుగుము. దేవాదిదేవా! నా దీనాలాపములను ఆలకించి, దర్శనభాగ్యము కలిగించుమని యీ దీనుడు వేడుచున్నాడు.



(38) కరుణాంతరంగుడైన ఆ సాయియే భక్తుల జీవితములను సుఖశాంతులతో నడిపించును. సంతానము లేదని దుఃఖించకుము. సమయానుకూలముగా ఆయనే నీకు ధైర్యము, బలము వగైరాల నిచ్చును. ప్రపంచమునకే సృష్టికర్త అయిన ఆయనయే నీకు వలసిన సహాయము చేయును. అట్టి సాయినాథునే మనము భజించెదము గాక!


(39) దేవదేవా! నీవెన్ని రూపములు దాల్చినావోగదా ! నీవే సచ్చిదానందమూర్తివి. కళాకారుడెన్ని పాత్రలు ధరించినను, తాను మాత్రమొక్కడే అయినట్లు నీవే అన్నిటికిని మూలము. కర్తయు, భర్తయు నీవే గదా! సర్వభూతాత్మకుడైన నారాయణుడవును నీవే. ఆది మధ్యాంత రహితుడవు. నీకు సాటి మరొకరు లేరు. జ్ఞానులు, తపస్సంపన్నులు నిన్ను పొందగోరి తప మాచరించుచుండగా గోపకాంతలతో రాసక్రీడలాడు గోపాలునివలెను, కురుక్షేత్రమున పార్థునకు జ్ఞానబోధయను పథ్యమిచ్చి, యుద్ధ విముఖతయను రోగమును కుదుర్చుటకు గీతోపదేశముచేయు శ్రీకృష్ణునివలెను ఉంటివి. భక్తుడైన ఏకనాథుడు, గౌరాంగుడు, రామదాసు మొదలైనవారు నీ సాన్నిధ్యమును చేరి కైవల్యమందిరి గదా!

(40) బాబా సాయీ ! నీకు వాసుదేవునకు చాలా దగ్గరి సంబంధము కలదు. నీవు జీవులను జాగృతపరచినావు. వాసుదేవుని వలెనే నీవును ఏ కార్యమునైనను చేయగలవు. వాసుదేవుడు హృషీకేశుడను బిరుదు పొందగా, నీవెందరో అజ్ఞానుల నుద్ధరించితివి. ఈ అజ్ఞానియైన బాలుని అపరాధములు క్షమించి, నన్ను రక్షింపుము.

(సశేషం)

# అబ్దుల్లా బాబా

**యం. విద్యాసాగర రావు,** ఇంటి నెం. 1-4-48బి, భావనగర్ కాలనీ,
పొన్నూరు, గుంటూరు జిల్లా. ఫోన్ :
0863-243484



శ్రీసాయిభక్తుల కష్టాలను గట్టెక్కించటానికి భూమిపై అవతరించిన అవతారమూర్తి. నైతిక విలువలను పునరుద్ధరించి సమాజమును సంస్కరించిన సమర్థసద్గురువు సాయి. శ్రీసాయి అవతార ప్రాశస్తమే అది.

శ్రీసాయిబాబా 1858లో రెండవసారి శిరిడీ వచ్చినప్పటినుండి శిరిడీ గ్రామస్తులతో కలిసి మెలిసి జీవించసాగిరి. దయార్ద్రహృదయుడు, ప్రేమమూర్తియైన శ్రీసాయి గ్రామస్తులకు వైద్యముచేయుచు వారిని ఆపదలలో ఆదుకొనుచు మశీదులో స్థిరనివాసమేర్పరుచుకొనిరి. మొదట 28 సం॥లు ఎటువంటి లీలలు చూపించలేదు. 1886లో ఒక అద్భుతమైన లీలను చూపించిరి. శరీరము నుండి ఆత్మను వేరుచేసి 72 గంటలు సమాధి స్థితియందు వుంచిరి. అప్పటి నుండి సాయిబాబా యొక్క మహిమలు యితర ప్రాంతములకు తెలియుట ప్రారంభమై శ్రీసాయిబాబాను దర్శించుటకు షిరిడీకి భక్తులు రాసాగిరి. శ్రీసాయిబాబా కూడా తన అవతార కార్యక్రమము ప్రారంభించిరి. కొందరిని బాబా శిరిడీకి పిలిపించుకొని ఒక్కొక్కరిని ఒక్కొక్కసేవకు ఉపయోగించుకొనిరి.



అందులో అబ్దుల్లా అను నతనిని బాబా తన సేవకు శిరిడీ పిలిపించుకున్నారు. ఈయన నాందేడు నివాసి. ఇతను 1869లో జన్మించెను. సుల్తాన్ కుమారుడు.

నాందేడు అనుచోట అమరుద్దీన్ అనే సాధువుండేవాడు. అబ్దుల్లా అతనిని సేవిస్తూ యుండేవాడు. 1889లో ఒకరోజు శ్రీసాయిబాబా ఫకీరు అమరుద్దీన్‌కు స్వప్నదర్శనమిచ్చి ఆయన చేతిలో రెండు మామిడిపండ్లను పెట్టి అబ్దుల్లాను "నా దగ్గరకు పంపవలసినది"ని చెప్పిరి. అలా బాబా ఆదేశము ప్రకారము అమరుద్దీను అబ్దుల్లాను శిరిడీకి పంపెను. అతను రాగానే నా 'కాకి' వచ్చినదని బాబా అనుచూ "నా సేవ చేసుకొనుచు యిక్కడనే వుండ"మని అబ్దుల్లాను బాబా అదేశించిరి. అబ్దుల్లా 20 సం॥ల వయస్సులో శిరిడీ వచ్చి తన జీవితమంతయు బాబా సేవలో గడిపి 1951లో సాయి సాయుజ్యము పొందిరి. అబ్దుల్లా ప్రతిరోజు మసీదు, బాబా సంచరించు వీధులన్నియు శుభ్రం చేసేవాడు. మశీదులోను, చావడిలోను దీపములు పెట్టేవాడు. నిరతాగ్నియైన ధునిలో కట్టెలు వేసేవాడు. బాబా లెండి తోటకు వెళ్ళినప్పుడు వెంట వెళ్లేవాడు. ఈ లెండి తోటలో బాబా వెలిగించిన నందదీపమునకు వెనుక బాబా కూర్చునేవారు. అప్పుడు అబ్దుల్లా రెండు కుండలలో నీళ్ళు వుంచేవాడు. బాబా వాటిని చుట్టు చల్లేవారు. బాబా రోజు మార్చి రోజు చావడిలో పడుకొన్నప్పుడు అబ్దుల్లా కూడా బాబాతో పడుకునేవాడు. అబ్దుల్లాను బాబా తిట్టేవారు, కొట్టేవారు. అవన్నియు బాబా ఆశీస్సులుగా అబ్దుల్లా భావించేవాడు. ఇతను ఖురాను పఠించేవాడు. బాబా భక్తులకు చెప్పే మంచి విషయాలను ఒక పుస్తకములో వ్రాసి వుంచుకొనేవాడు. అలా వ్రాసి వుంచుకున్న విషయాలు అవసరమైనప్పుడు భక్తులకు పుస్తకము చూసి చెప్పి వారి సమస్యలను పరిష్కరించేవాడు.

బాబా అనుగ్రహముతో అబ్దుల్లా చేసిన సేవకు గుర్తింపుగా కొన్ని శక్తులు వచ్చినవి. ఆధ్యాత్మిక సాధన కొరకు అబ్దుల్లాను నిద్రతో కాలము వ్యర్థపరచవద్దని, భోజనము కూడా తక్కువ చేయమని చెప్పేవారు సాయి. అబ్దుల్ భిక్షచేసి జీవించేవారు.

డా॥ పిళ్ళే నారికురుపు వ్యాధితో బాధపడుతుంటే బాబా కాకి వచ్చి నిన్ను రక్షిస్తుందన్నారు. అలాగే సాయంత్రము దీపములు వెలిగించుటకు అబ్దుల్ వచ్చి చీకటిలో చూడక పిళ్ళే నారికురుపుపై కాలువేసెను. పురుగులన్నియు బయటకు వచ్చి పిళ్ళే బాధ తగ్గెను. ఆ విధముగా పిళ్ళేకు బాధనుండి రక్షించెను.

బాబా దేహత్యాగమునకు ముందు అబ్దుల్లాను రమ్మని బాబా కబురు చేసెను. కాని అబ్దుల్లా వెంటనే రాలేదు. అతను వచ్చునప్పటికి బాబా దేహత్యాగము చేయుట చూసి తన దురదృష్టమునకు చింతించెను. అబ్దుల్లా రాధాకృష్ణమాయి నిర్యాణం తరువాత ఆ యింటిలో వుండేవాడు. ఒకరోజు ఆ యింటి గోడలన్నీ కూలినా అబ్దుల్లాకు బాబా అనుగ్రహం వల్ల ఏమీ కాలేదు. తరువాత దీక్షిత్‌వాడాలోను, సమాధి మందిరములోను ఉన్నాడు.


అబ్దుల్లా 1918లో బాబా దేహానంతరము కూడా శిరిడీలోనే యుండి 1951వరకు బాబాసేవలో గడిపినాడు. ఇతని సమాధి లెండితోట గేటువద్ద వున్నది. బాబా స్వయంగా పిలిపించుకొని తన సేవను చేయించుకొన్న అదృష్టవంతుడు. మనమందరము గుర్తుంచుకొని నమస్కరించుకొనతగిన సాయి అంకిత భక్తుడు. చివరలో సమాధి మందిరములోనే యుంటూ బాబా సమాధికి అభిషేకముచేయుచు, మహానైవేద్యము పెట్టి దానిని ఆహారంగా స్వీకరించేవాడు. భక్తులు యిచ్చే దక్షిణలు స్వీకరించేవాడు. బాబాను అంకితభక్తితో సేవించిన మొదటివాడని చెప్పవచ్చును.



# పిలిచిన పిలుపే విశ్వవిఖ్యాతి గాంచిన వేళ!

## మహాభక్త భగత్ మహల్సాపతి జీవిత చరిత్ర

**సాయిదాసానుదాసు సురేంద్రబాబు,** కొవ్వూరు, నెల్లూరు జిల్లా



(గత సంచిక తరువాయి భాగం)


ఒకసారి మహల్సాపతి భార్య శిరిడీలో దూరంగా వున్న తన పుట్టింటికి వెళ్ళి అక్కడ కొన్ని రోజులు గడిపింది. అప్పుడు ఆమె గొంతుపై బాధాకరమైన వ్రణమొకటి లేచింది. ఆమె ఈ విషయం తన భర్తకు తెలియజేయలేదు. కానీ సర్వజ్ఞుడైన బాబాకు ఈ విషయం తెలియకుండ ఉండదు కదా! ఆ సమయంలోనే మహల్సాపతితో "నీ భార్య గొంతుపై కాన్సర్ కురుపొకటి లేచింది. దానిని నేను తప్ప మరెవరు బాగు చెయ్యలేరు. తప్పక బాగు చేస్తాను" అని హామీ ఇచ్చారు. ఈ విషయమేమీ తెలియని మహల్సాపతి, "తమ దయ బాబా!" అన్నాడు. తర్వాత కొన్ని రోజులకు తన భార్య నుండి ఉత్తరం వచ్చింది. తన గొంతుపై బాధాకరమైన వ్రణమొకటి లేచినట్లు, తర్వాత నాలుగైదు రోజులకు అది నయమైనట్లు తెలిపింది. మహల్సాపతి బాబాకు కృతజ్ఞత లర్పించుకున్నాడు.

మహల్సాపతి తన ముగ్గురు కుమార్తెలకు వివాహాలు జరిపించాడు. ఇతను పేదవాడు. కాబట్టి తన వియ్యంకులెవరికి ఇతనిపై గౌరవం లేదు.

ఒకసారి దూర ప్రాంతంలో ఉన్న వియ్యంకుడొకడు, ఏదో సందర్భంగా విందొకటి ఏర్పాటుచేసి మహల్సాపతిని కూడా ఆహ్వానించాడు. మహల్సాపతి అక్కడికి బయలుదేరి, బాబా అనుమతికై మశీదుకెళ్ళాడు. బాబా అనుమతిస్తూ "నీవక్కడ అవమానించబడతావు!" అన్నారు. బాబా చెప్పినట్లుగానే అయ్యింది. ఇతను అక్కడికి వెళ్ళేటప్పటికి, అందరూ భోంచేసి చేతులు కడుగుతున్నారు. ఇతని కోసం ఎవరూ ఎదురు చూడలేదు సరికదా ఇతను రాగానే ముభావంగా ఉండి సరిగ్గా ఆహ్వానించలేదు. మహల్సాపతి అవమాన భారంతో క్రుంగిపోయి భోజనం చేయకుండానే ఇంటికి తిరిగి వచ్చాడు.

మరొకసారి అస్తినగరం అను ఊరిలో మహల్సా పురాణ పఠనానికి మహల్సాపతి నాహ్వానించారు. అక్కడకి వెళ్ళడానికి బాబా అనుమతికోసం మశీదు వెళ్ళాడు. ఇతనిని చూడగానే బాబా "అస్తి నగరానికి వెళ్లకు. అక్కడ కొట్లాట జరుగుతుంది" అన్నారు. కానీ దైవకార్యానికి వచ్చిన ఆహ్వానాన్ని తిరస్కరించడం బాగుండదని తలచి ఆ ఊరికి వెళ్ళాడు. పురాణ పఠనం మొదలైంది. మరో ప్రక్క భోజనాలు జరుగుతున్నాయి. రౌడీ పిల్లలు కొందరు భోంచేస్తూ మాటలు పెంచుకున్నారు. తర్వాత కొట్టుకోవడం ప్రారంభించారు. ఈ కొట్లాట పెద్దదయ్యే సూచనలు కన్పించాయి. పురాణం వింటున్నవారు భయంతో లేచి పరుగులు తీశారు. మహల్సాపతి కూడ పుస్తకం చంకన పెట్టుకొని శిరిడీకి పరుగుతీశాడు. బాబా మాటలు పెడచెవిన పెట్టినందుకు తగిన శాస్తి జరిగిందని చింతించాడు. (ఇంకా ఉంది)






# సాయినాథ ఉవాచ

సేకరణ - వ్యాఖ్యాత సాయిదాసానుదాసు
**సురేంద్రబాబు**, కోవూరు, నెల్లూరుజిల్లా

***(శ్రీసాయివాక్కులు బ్రహ్మవాక్కులు! శ్రీసాయి షిరిడీలో సశరీరులుగా మెలిగిన 60 సం॥రాలలో వారి వాచ అసంఖ్యాకమైన వాక్కులు వెలువడ్డాయి. వాటిలో ఆణిముత్యాల్లాంటి కొన్నింటిని ఏర్చి, సందర్భోచిత వ్యాఖ్యాన సహితంగా దిగువ ఇవ్వడం జరిగింది, అవధరించండి)***

*(గత సంచిక తరువాయి భాగము)*

***(282) "అతనిని పంపుతాను. కానీ 'థూ, థూ' అని అసహ్యించుకుంటూ, మా భోజనాలగదికి రానివ్వకుండ దూరంగా ఉంచకుండ ఉంటేనే!"***



ఒకసారి దాము అన్నా శిరిడీలో ఒక విందు ఏర్పాటుచేశాడు. బాబాను విందుకు ఆహ్వానించాడు. కాని బాబా నిరాకరించారు. కానీ, నిత్యమూ బాబాను సేవించే హరిజనసేవకుడు బాలాపటేళ్ అప్పుడు బాబా దగ్గరే కూర్చుని యున్నాడు. బాబా బదులు వారి సేవకుడినైనా పంపమని దామ్యా బాబాను అర్థించాడు. దామూ సనాతనాచారపరుడని బాబాకు తెలుసు. అందుకే బాబాపై విధంగా హెచ్చరించారు. బాలా పటేల్‌కు అవమానం జరగదని దామ్యా వాగ్దానం చేసి పటేల్‌ను విందుకు తీసుకెళ్ళాడు. దాము అతనిలోనే బాబాను

చూచుకుంటూ, అతనిని సహపంక్తిలో తన ప్రక్కనే కూర్చోబెట్టుకొని భోజనం పెట్టి గౌరవించాడు.

### *(283) "ఏమిటి! నీవు మనిషిని పూజిస్తావా?" "పరాయివాళ్లు ఉన్నప్పుడు మేము మా బిడ్డలను దూరంగా ఉంచుతాము!"*



ఇండోర్‌కు చెందిన రేగే తనకొచ్చిన మూడుస్వప్నాల ద్వారా శ్రీసాయిబాబాయే తన గురువని తెలిసికొని, శిరిడీ వెళ్ళాడు. మశీదుకు వెళ్లి, బాబా పాదాలకు నమస్కరించబోయాడు. బాబా తన పాదాలను వెనక్కి ముడుచుకుని, ( ఏమిటి ! నీవు మానవుణ్ణి పూజిస్తావా" అని అడిగారు. తిరస్కారము, హేళన మిళితమైయున్న ఈ చీవాటు అతని హృదయానికి గట్టిగా తగిలింది. తన స్వప్నం సూచించినట్లు బాబా అతనిని చేరదీయలేదు. ముభావంగా ఉండిపోయారు. రేగే ఖిన్నుడై, చాలాసేపు మండపంలో కూర్చుని ఆలోచించసాగాడు. తను విద్యార్థిగా ఉన్నప్పుడు "మనుష్యపూజ పనికిరాదనే సమవాద సిద్ధాంతమొకటి తన మనస్సులో నాటుకపోయింది. దానినే బాబా యిప్పుడు వెలికితీసి, తన భావం తప్పని పరోక్షంగా తెలియజేశారు. బాబా అంతర్యామిత్వానికి రేగే ఆశ్చర్యపోయాడు. మండపంలో మధ్యాహ్నం వరకు వేచి ఉండి, వారు ఒంటరిగా ఉన్నప్పుడు తిరిగి వారిని సమీపించి, వారి పాదాలకు నమస్కరించాడు. ఈసారి బాబా అతనిని సాదరంగా లేవనెత్తి



తమ హృదయానికి హత్తుకుని, "నీవు నా పుత్రుడివి. పరాయివాళ్లు ఉన్నప్పుడు మేము, మా బిడ్డలను దూరంగా ఉంచుతాము" అన్నారు. (ఇక్కడ 'పుత్రుడు' అంటే ఆధ్యాత్మికపుత్రుడని, "మేము" అంటే సాధువులని అర్థం). రేగే బాబా చూపిన కృపకు ఆనందపరవశుడయ్యాడు.

### **(285.) "గవర్నమెంటు సర్వీసు నాశనమైపోతే పోయిందిలే ! వాడిని నా సేవ చేసుకోనీ!"**

దాదాకేల్కర్ మేనల్లుడు బాబు, సాఠే సెక్రటరీ దగ్గర గుమాస్తాగా పనిచేస్తూ ఉండేవాడు. బాబుకు ఉద్యోగం పై ధ్యాసలేదు. ఎప్పుడు బాబా దగ్గరే ఉంటూ, వారిని సేవిస్తూ ఉండేవాడు. ఇలా ఉద్యోగానికి నాగాలు పెడితే, ఉద్యోగం ఊడిపోతుందేమోనని కేల్కర్ భయపడ్డాడు. బాబు గవర్నమెంటు సర్వీసులో ఉన్నాడని, వాడు విధులకు సరిగా హాజరుకావడంలేదని, కేల్కర్ బాబాకు ఫిర్యాదుచేశాడు. అప్పుడు బాబా "గవర్నమెంటు సర్వీసు పోతే పోయిందిలే, వాడిని నా సేవచేసుకోనివ్వు" అన్నారు. గురుసేవయే మానవ పరమావధి అని బాబా పరోక్షంగా చెప్పారు.

### *(286) "బ్రాహ్మణులు వారి నడవడివలన ఎక్కువ పైసలు గడిస్తారు"*

బాబా మాట్లాడే మాటలు నర్మగర్భితంగా ఉండేవి. వారు మాట్లాడేమాటలలో బయటకు కన్పించే భావం ఒకటైతే, నిజమైన భావం వేరొకటిగా ఉండేది. ఉదాహరణకు వారి నోటినుండి ఎప్పుడూ "పైసలు,పైసలు" అని వెలువడుతుండేవి. భక్తులు పైసలంటే ప్రభుత్వం ముద్రించే నాణాలని

భావించి, బాబాకు డబ్బుమీద ఆసక్తి మెండని అనుకునేవారు. అలా అనుకోవడం సహజమే. కాని పైసలంటే "పుణ్య"మని బాబా భావం. బ్రాహ్మణులు అంటే భాగవతులనిగాని, దైవ భక్తి గలవారనిగానీ తీసుకోవాలి. భాగవతులు వారి మంచి నడవడి వలన ఎక్కువ పుణ్యం సంపాదిస్తారని, అనేదే బాబా యొక్క భావంగా నార్కే తెలిసికొని మనకు వివరించాడు.

***(287) "ఇది నా ఇల్లు. కాని నేనిక్కడ లేను. నా మూర్షిద్ నన్నిక్కడ నుండి తీసుకెళ్ళాడు".***

బాబా భౌతికశరీరం శిరిడీలో ఉన్నప్పటికీ, వారక్కడ లేరు. వారు తమ సూక్ష్మశరీరంతో ఈ విశ్వమంతా పర్యటించి, పరిస్థితులను తమ అదుపులో ఉంచుకుంటారు. తాము తమ శరీరంలో లేమని, భక్తులకు స్పష్టంగా తెలియజేశారు. ఒకసారి బాబా తమ దేహాన్ని చూపుతూ, అది తమ ఇల్లని, కానీ తామక్కడ లేమని, వారి ముర్షిద్ (గురువు) అక్కడ నుండి తీసుకెళ్ళారని తెలిపారు. అంటే వారి దేహాత్మబుద్ధిని, వారి ముర్షిద్ సంపూర్ణంగా తుడిచివేశారని వారు చెప్పారు. ఈ విషయం బాబా చెపుతుండగా నార్కే విని మనకు తెలియజేశాడు.

***(288) "ఎవరు నా శిష్యులని చెప్పడానికి సాహసించగలరు? ఎవరు నన్ను తృప్తిగానూ, తగిన విధంగానూ సేవించగలరు?***

సాయిబాబాకు భక్తులేకాని శిష్యులు ఎవరూ లేరని మనకు నార్కే ద్వారా తేటతెల్లమవుతుంది. ఒకసారి నార్కే బాబా సన్నిధిలో ఉన్నప్పుడు





బాబా తమ భక్తులతో, "నేను నా గురుసన్నిధికి రావడానికి వణికిపోయేవాణ్ణి" అన్నారు. మరోసారి, "నేను నా గురువును సేవించినట్లు, నన్నెవరూ సేవించలేరు. ఎవరు నా శిష్యుడనని ధైర్యంగా చెప్పగలరు? ఎవరు నన్ను తృప్తిగానూ, తగిన విధంగానూ సేవించగలరు? అని ప్రశ్నించారు. దీనిని బట్టి బాబాకు భక్తులే కానీ శిష్యులెవరూ లేరని మనకు అర్థమౌతుంది.

***(289) "నేను నీ తండ్రినికదా ! నీకు కావలసినవన్నీ నానుండే పొందాలి. తండ్రిని గురించి అలా మాట్లాడటం తగదు !"***

పురాణాలన్నీ నిజం కాదని, బాబా దేవుడు కాదని, దైవశక్తులున్న మానవమాత్రుడేనని ప్రొఫెసర్ నార్కే వాదించేవాడు. ఒకసారి నార్కే బాబా సన్నిధిలో ఉన్నప్పుడు, భక్తులు "బాబా ! మీరు దేవుడు కాదని నార్కే చెబుతున్నాడు" అని ఫిర్యాదు చేశారు. బాబా, "అతను చెప్పినది వాస్తవమే" అని చెబుతూ, నార్కే వైపుకు తిరిగి, "కానీ నీను నీ తండ్రిని కదా ! తండ్రిని గురించి అలా మాట్లాడటం తగదు". నీకు కావలసినవన్నీ నా నుండే పొందాలి" అన్నారు సాయి.

(ఇంకా ఉంది)

# మంచిమాటలు

1. భోగము ఉన్నచోట రోగము, వార్ధక్యము సంభవించును.
2. నాలుకను వశపరచుకొన్నవారికి లోకమే వశమవుతుంది.
3. కోపము లక్ష్మిని, అసూయ ధర్మాన్ని నశింపజేస్తుంది.
4. నీచత్వము, స్వార్థపరత్వము - ఈ రెండు క్షమించలేని పాపములు.
5. పరాధీనమైనదంతా దుఃఖం, స్వాధీనమైనదంతా సుఖం.
6. పిరికితనము, ద్వేషము, భయము పాదుకొనియున్న హృదయములో భగవంతుడు పొడచూపడు.
7. ఆశ ధైర్యాన్ని, మృత్యువు ప్రాణాల్ని హరిస్తాయి.
8. ఆశ కలవాడే దరిద్రుడు. సంతృప్తి కలవాడే శ్రీమంతుడు.
9. మంచి మనసుతో చూడగలిగితే అంతటా సుఖశాంతులే లభిస్తాయి.
10. ఈర్ష్యయే అన్ని అనర్థాలకు మూలము.
11. అధిక ప్రసంగము, క్రోధము అనే కత్తులు మానవుని ఆయుఃప్రమాణాన్ని నరుకుతుంటాయి.
12. నీకు మనశ్శాంతి కావాలంటే ఇతరులను నిందించకు.
13. శాంతంతో క్రోధాన్ని, దానముతో లోభాన్ని, సత్యముతో అసత్యాన్ని జయించాలి.
14. విద్యా, ధనము విరివిగా ఉన్నా గర్వము లేకుండా చరించేవాడే పండితుడు.
15. ఆత్మవిశ్వాసము మానవుని చేత పర్వతాలనైనా కదలింప చేస్తుంది.
16. చేతలను బట్టి ఒక వ్యక్తి శీలమును నిర్ణయించాలి గాని అతని వేషధారణలను బట్టి కాదు.
17. అహంకారము అవతరించిన హృదయంలో భగవంతుడు ప్రకాశింపడు.
18. ఆత్మజ్ఞాన మొకటే సర్వదుఃఖనివారము.




# శ్రీసాయిబాబా జన్మరహస్యం

సాయిదాసానుదాసు సురేంద్రబాబు, కొవ్వూరు, నెల్లూరు జిల్లా

**ఇతర చరిత్రకారులు రూపకల్పన చేసిన కథలు**

**శ్రీ సాయిశరణానంద స్వామి చెప్పిన కథ**



పత్రి అను గ్రామం మహారాష్ట్రలో, మరాట్వాడా ప్రాంతంలో, మానవత్‌కు 5 మైళ్ళ దూరంలో ఉంది. పత్రిలోని ఒక యజుర్వేద దేశస్థ బ్రాహ్మణునికి ముగ్గురు కుమారులున్నారు. పెద్దవాడే సాయిబాబా.సాయిబాబాకు అయిదు సంవత్సరాల వయస్సు ఉన్నప్పుడు, ఒక ఫకీరు అతని ఇంటికి వచ్చి, "నాది నాకిచ్చేయ్" అన్నారు. అందుకు బ్రాహ్మణుడు "నా దగ్గరున్నదంతా మీదే కదా స్వామీ !" అని బదులు చెప్పాడు. ఫకీరు వారి పెద్దకుమారుని తీసుకొని వెళ్ళిపోయాడు. నాలుగు సంవత్సరాల తర్వాత, ఫకీరు బాలునితో వచ్చి, వారికి కన్పించి, తిరిగి బాలుని తీసుకొనివెళ్ళిపోయాడు. తర్వాత వాళ్ళేమైంది ఎవ్వరికీ తెలియదు. బహుశా బాబా, తాము ప్రయాణించినట్లు పైన చెప్పిన మార్గంలో ప్రయాణించి, ఔరంగాబాద్ చేరి, అక్కడ తమ గురువుదగ్గర 12 సం॥లు గడిపి, తర్వాత 18 సం॥ల బాలయోగిగా శిరిడీలోని వేపచెట్టు క్రింద ప్రత్యక్షమై ఉంటారని భావించబడుతుంది.

పై కథకు లభించిన ఆధారాలు, ఋజువులు బాబా పూర్వాశ్రమనామం ప్రముఖ సాయిభక్తుడైన విశ్వాస్ ఖేర్ అను చరిత్రకారుడు సాయి

జన్మ రహస్యభేదనకు పూనుకొని పరిశోధనలు జరిపినట్లు, వ్రాయడం జరిగింది కదా ! 1975లో అతడు 'పత్రి'గ్రామానికి వెళ్లి పరిశోధనలు జరిపి, అక్కడ నివసించిన దేశస్థ యజుర్వేద బ్రాహ్మణులైన భూసరి కుటుంబములో సాయిబాబా జన్మించినట్లు తేల్చాడు. అప్పుడు సాయిబాబా మూడవతరం వాడైన రఘునాథ్ మహా రుద్రభూసరి అనునతడు ఉస్మానియా యూనివర్శిటీలో మరాఠీ ప్రొఫెసర్‌గా పనిచేస్తూండేవాడు. ఖేర్ అతని జాడ తెలిసికొని, వారిని కలిసి వారితో సంభాషించాడు. భూసరి కుటుంబ వంశవృక్షం సంపాదించాడు. దాని ప్రకారం రఘునాథ్ పితామహుడైన రఘుపతి భూసరికి నలుగురు సోదరులు. వారి పేర్లు దాదా, హరిభావు, అంబాదాస్ మరియు బల్వంత్. చివరి ముగ్గురూ చిన్నప్పుడే ఇల్లు విడిచి వెళ్ళిపోయారు. అంబాదాస్, బల్వంత్‌లు తమ అదృష్టాన్ని వెతుక్కుంటూ వెళితే, హరిభావు భగవంతుని అన్వేషిస్తూ వెళ్లిపోయాడు. ఈ వివరాలన్నీ రఘునాథ్ తన చిన్నప్పుడు, తన నానమ్మద్వారా తెలుసుకున్నట్లు చెప్పాడు. దీనిని బట్టి 'హరిభావే' సాయిబాబా అయి ఉంటాడని ఖేర్ నమ్మాడు.

ఖేర్, తర్వాత దినకరరావు అను న్యాయవాది ఇంట్లో కొన్నిరోజులు బసచేసి, విషయాలు సేకరించాడు. పత్రికి చెందిన భక్తుడు బాబాను దర్శించినప్పుడు, బాబా పత్రికి చెందిన కొందరు పెద్ద మనుష్యుల యోగక్షేమాలు విచారించినట్లు మనం తెలుసుకున్నాము కదా ! వారు విచారించినది దినకరరావు పితామహులైన శ్యామారావు, అతని సోదరుడైన భలేరావుల గురించేనని, వారిరువురు (హరిభావు) యొక్క సమకాలీకులని (Contemporaries) కూడా ఖేర్ తెలుసుకున్నాడు. ముందు చెప్పిన ప్రొఫెసర్ రఘునాథ భూసరి పినతండ్రి కుమారుడైన బావూభూసరి, దుర్భరపరిస్థితులలో



మరణించినప్పుడు దినకరరావు తండ్రి, "సాయిబాబా వంశాంకురానికేం గతి పట్టింది?" అని వ్యాఖ్యానించినట్లు దినకరరావు ద్వారా తెలుసుకున్నాడు. తర్వాత దినకరరావు ఇంటికొచ్చిన కొందరు మహమ్మదీయ క్లయింట్లను బాబా విషయం విచారించాడు. వారు సాయిబాబా తల్లితండ్రుల పత్రికి చెందిన బ్రాహ్మణులని, వారు తమకు తమ పూర్వీకుల నుండి ఎరుగుదుమని ధృవపరిచారు.

పైన చెప్పిన ఆధారాలే గాక, పత్రి అంచునే 'లెండీ' అను నది ప్రవహిస్తూ ఉండటం ఖేర్ గమనించాడు. బహుశా శిరిడీలోని తోటకు దాని జ్ఞాపకార్థమే "లెండీతోట' అని పేరుపెట్టి ఉంటారని అనుకోవడానికి ఆస్కారముంది. పత్రిలోనూ, పత్రి పరిసరాలలోనూ, అంటే మరాట్వాడ ప్రాంతంలో చిన్నలు, పెద్దలూ, నాగరికులు, అనాగరికలు అందరూ ఒకే యాసతో మరాఠీ మాట్లాడేవారట. బాబా కూడా ఇదే యాసతో మరాఠీ మాట్లాడేవారని భక్తుల ద్వారా తెలుసుకున్నాడు. దీని ద్వారా బాబా పత్రికి చెందినవారని రూఢి అవుతుంది. (ఉదాహరణకి ఆంధ్రప్రదేశ్‌లోని తెలంగాణా, ఉత్తరకోస్తా, దక్షిణకోస్తా, రాయలసీమ ప్రాంతంలో జన్మించిన నలుగురు ఒకచోట చేరి మాట్లాడుకుంటున్నారని అనుకుందాం. వారు మాట్లాడే తెలుగు యాసనుబట్టి ఎవరెవరు ఏయే ప్రాంతాలకు చెందినవారో సులభంగా మనం గురించవచ్చు. అలాగే మహారాష్ట్రలోని ప్రాంతంవారు ఒక్కొక్క యాసతో మరాఠీ మాట్లాడటం వల్ల ఎవరు ఏ ప్రాంతానికి చెందినవారో సులభంగా గుర్తించవచ్చు.)

ఇవే గాక పత్రిలోని అన్ని బ్రాహ్మణకుటుంబాలకు, రేణుకాదేవి కానీ, యోగీశ్వరి కానీ కులదైవమైతే, భూసరి కుటుంబానికి మాత్రము 'హనుమాన్' కులదైవంగా ఉండటం, బాబాకు హనుమాన్ అంటే భక్తిప్రపత్తులు ఉండటమే

కాక, తమ మహాసమాధికి ముందు శ్రీరామవిజయాన్ని వఝే అనే భక్తునిచేత పారాయణ చేయించి వినడం, శ్రీరామనవమి రోజు ఉరుసు, చందనోత్సవాలు జరిపించమని ఆదేశించడం, బాబా చావడికి వెళ్ళేటప్పుడు తిరిగి వచ్చేప్పుడు మారుతి దేవాలయం వైపు చూస్తూ, ఏవో సంజ్ఞలు చేస్తూ ఉండటం, తమను తమ పెద్దలు మారుతికి అప్పగించారని, మారుతి తమ సోదరుడని చెప్పడం మొదలైనవన్నీ 'హరిభావే' సాయిబాబా అని నమ్మడానికి దోహదపడ్డాయి. అందుకే ఖేర్ 'పత్రి'లో 'శ్రీసాయి స్మారక సమితి' అను సంస్థను స్థాపించి, దానిపేరుతో శిథిలావస్థలో నుండి, సాయిబాబా నివసించిన ఇంటిని ప్రస్తుత వారసుడైన ప్రొఫెసర్ రఘునాథ్ మహారుద్రభూసురినుండి, కొనుగోలుచేసి, దానిని పునరుద్ధరించి, అక్కడొక మందిరం నిర్మించి బాబా విగ్రహాన్ని ప్రతిష్ఠింపజేశాడు. అక్కడ ఇప్పుడు నిత్యపూజలు జరుగుతుండటం మనం చూడవచ్చు. (సశేషం)


## శ్రీసాయి ప్రచార ప్రతినిధులు కావాలి

**శ్రీసాయిదర్శన్, శ్రీసాయిదర్శన్ చారిటబుల్ ట్రస్ట్ తరుపున మీ గ్రామములో / మీ పట్టణములో నిస్వార్థసేవ చేయగల మహనీయులు కావలెను. వివరములకు ఈ దిగువ అడ్రసుకు వ్రాయండి.**

**SRI SAI DARSHAN CHARITABLE TRUST**
**Dammaiguda ,**
**Hyderabad - 500 083**
**Phone : 040-65640220**
**Cell : 98667 48099**




# సంకల్ప స్పందనము

బహిరంగముగా ప్రబోధించు యోగులకంటెను, ఇతరులకు తెలియకుండానే, అయిస్కాంతము వంటి ఆధ్యాత్మిక స్పందన శక్తిచే ప్రపంచమునకు ప్రబోధించి శ్రేయస్సు నొనగూర్చువారు నిజమైన యోగీశ్వరులనబడుదురు. బహిరంగముగా, ఉన్నతములైనట్టి ఉపన్యాసవేదికలపై ఉపన్యసించు వారాధ్యాత్మికముగా రెండవ తరగతికి చెందినట్టి వారైయున్నారు. ఇట్టివారు నిజమైన యోగులు యందు గల గుప్తజ్ఞానమును, అసాధారణమైన మేధాశక్తిని, మహత్తరమగు శక్తి, సంపన్నతను గుర్తింపజాలరు. వారికా శక్తుల నుపయోగించు విధానమున్నూ తెలియదు. ప్రపంచమునందు నలుమూలల యందున్నట్టి అధికారులై యున్న ముముక్షువులకు, సర్వజ్ఞుడైన మహాత్ములు వారి సందేశములను మానసిక తంతిద్వారా పంపుచుందురు. మన కసాధారణమగు అనేక విషయములు యోగిపుంగవులకు సాధారణమై యుండును. వారు తేలికగా క్లిష్టసమస్యలను సాధింపగలరు.

# శక్తిపాతం


ఆత్మదర్శనం పొందిన మహాత్ములకు సహస్రారచక్రం ద్వారా విశ్వశక్తి ప్రవహిస్తుంది (కాస్మిక్ ఎనర్జీ). ఈ ధార వీరి సహస్రారం మీదపడి పాదాల ద్వారా భూమికి వెళుతుంది. ధ్యానం చేసినప్పుడు ఈ ధార యింకా ఎక్కువ. ఈ దివ్య భాగ్యంవలన అట్టి గురువు ఎవరిని తాకినా, భక్తులు గురుసన్నిధిలో వున్నా ఈ కాస్మిక్ ఎనర్జీ వారిలో ప్రవేశిస్తుంది. దీనిని శక్తిపాతమంటారు. ఇటువంటి గురువులు ఒక పండు ఇచ్చినా, ఇంట్లో కాలుపెట్టినా శక్తిప్రవేశం – దుష్టశక్తులు పారిపోవడం దోషాలు వుంటే నశిస్తాయి.

– సేకరణ : కె. ఆర్. విజయకుమార్, మదనపల్లి

# శ్రీలలితా సహస్రనామములు(అర్ధసహితము)

(గతసంచిక తరువాయి భాగం)- ***యఱ్ఱమిల్లిసరోజినిజోగారావు.*** హైదరాబాద్

**131.“ఓం శాన్తిమత్యై నమః”** :



పరమశాంతమే భూషణముగా గలిగి, తన భక్తులు, తప్పులు చేసినా, సరిదిద్ది, క్షమాభిక్ష నొసగు శ్రీశాంతిమతికి నమస్కారము. ‘శాంతము లేక సౌఖ్యము లేదన్నారు’ శ్రీ త్యాగబ్రహ్మ. పరమశాంతస్వభావురాలు – శాంతగుణము ప్రధానమని మనకు ఆదర్శమైన సుగుణము ప్రభోదించును.

**132.“ఓం నిరాధారాయై నమః”** : ఆధారమే అవసరం లేని పరబ్రహ్మ స్వరూపిణి, ఈ సకలసృష్టికి ఆధారమై నిర్గుణ, నిరామయ, నిర్మల, నిరాకారమై సర్వాంతర్యామిగా భాసిల్లు జగసాక్షిణికి సాష్టాంగనమస్కారం.

**133.“ఓం నిరంజనాయై నమః”** : నిత్యసత్యానంద స్వరూపిణి, సహజానందదాయిని, సర్వజనని, అంజనములేని నిరంజన రూపిణి. అంజనం అనగా దోషాలు. ఎటువంటి దోషాలు అంటని దోషరహిత, నిర్మల స్ఫటికమువలె స్వచ్ఛంగా వెలుగు నిరంజని, సకల సాక్షియై వీక్షించు, సాక్షిరూపిణికి నమస్కారం.



**134.“ఓం నిర్లేపాయై నమః”** : కర్మలను లేపనం అంటారు. మనలో ఆత్మజ్యోతియై వెలుగు, శ్రీపరంజ్యోతిరూపిణికి, మనం చేయు కర్మఫలితములంటదు. కర్మాకర్మ ఫలము, దేహమునకే గానీ దేహికి అంటదు. అనగా, ఆ జీవుడు చేసిన పుణ్యాపుణ్యఫలము అనుభవించవలసినది, జీవుడు. సర్వసాక్షియై వీక్షించు, జగదీశ్వరి. శ్రీనిర్లేపకు నమస్కారము.

**135.“ఓం నిర్మలాయై నమః”** : తన భక్తునిలో, అంతర్యామియై నిర్మల, నిశ్చలమైన తత్వరూపిణి, ప్రకాశించి, అవిద్య అజ్ఞానమును మాయా మలవిక్షేపములు, అంటకుండగా సర్వదా రక్షించు, నిర్మల స్వభావంగల పరమేశ్వరికి నమస్కారము.

**136.“ఓం నిత్యాయై నమః”** : సృష్టికి పూర్వము సాక్షిగా, సృష్టి మధ్యమున స్రష్టగా, సృష్టి అంతమున ద్రష్టగా అనగా సృష్టి, స్థితి, లయకారిణియై, నిత్యము నిత్యమంగళదేవి, దేశకాలములకతీతంగా, నిత్యషోడశ దేవతలలో ‘నిత్య’స్వరూపిణిగా, శుక్లపక్షదశమి నాటి తిథి ‘నిత్యదేవత’గా శ్రీమహానిత్యయై, ఇత్యానందినిగా సర్వాంతర్యామి భాసిల్లును.

**137.“ఓం నిరాకారాయై నమః”** : ఆకారము లేని నిరాకారి, సకలసృష్టిలో అన్ని ఆకారములు, అన్ని నామములు తానై, కోటి సూర్యుల దీప్తివెలుగు కోమలాంగి, నిరాకారి, సర్వాంతర్యామికి నమస్కారము.

**138.“ఓం నిరాకులాయై నమః”** : సర్వాంతర్యామియై, మనలోని భావవికారములను, చిత్తసంక్షోభ చాంచల్యాదులను పారద్రోలి, సకల ప్రాణతత్వమైన హర్షశోకాదులకు అతీతమై, కులకుండలినీరూపిణి, చిద్విలాసిని, షట్చక్రకూటమియందు, సంచరిస్తూ, సగుణ, నిర్గుణ రూపాతీతమై, సర్వసాక్షియై వీక్షించు దివ్యతేజోమయికి నమస్కారం. (సశేషం)

# ఓంకార స్వరూపుడు శ్రీ శిరిడీ సాయినాథుడు

**-డా॥ఎమ్. కనకాచారి,** ఇఫ్ఎల్‌యు, హైద్రాబాద్



''ఈ జగత్తు మిథ్య. ఇది జగద్భ్రమలను సృష్టిస్తుంది. నిజానికి నేను బ్రహ్మమును. అహం బ్రహ్మస్మి, నేను నిత్య శుద్ధ బుద్ధముక్తుడను. నేనే వాసుదేవుడను. నేనే ఓంకారాన్ని, నన్ను శ్రద్ధ భక్తిసహితంగా పూజిస్తేచాలు. శ్రేయస్సు పొందుతారు. ఇలా నన్ను నిజంగా తెలుసుకొని, నన్ను సరిగా పూజించాలి. నన్ను అనన్య శరణుపొంది, నాతో ఏకం కావాలి" అని సాయిబాబా బోధచేసినట్లు శ్రీసాయిసచ్చరిత్ర (శ్రీ స్వామి అచలానంద సరస్వతి వారి తెలుగు అనువాదం, 3వ అధ్యాయం, పు. 29)లో చెప్పబడింది.

పై మాటలను మనం పరిశీలించినట్లయితే బాబావారు స్వయంగా ఓంకార స్వరూపుడని తెలుస్తుంది. అదే విధంగా శ్రీ దాసగణు మహారాజ్ 'శ్రీసాయినాథ స్తవన మంజరి' వ్రాసి దానిలోని దేవస్తుతిలో బాబా వారిని 'ఓంకార స్వరూపా!' అని సంబోధిస్తారు. దానికి బాబా అంగీకరించి ఆమోదించారు. దీనిని బట్టి బాబా సాక్షాత్తు ఓంకార స్వరూపుడే.

కాబట్టి అసలు 'ఓం' అంటే ఏమిటి? దానిని విశ్లేషిస్తే నానార్థాలు



ఏమిటి? ఓంకారనాదం వలన కలిగే లాభాలు, దాని విశిష్టత గురించి ప్రతి సాయి భక్తుడు తెలుసుకోవలసిన అవసరం ఎంతైనా వుంది. అందుకే ఈ వ్యాసం.

ఓం అనునది దివ్యమైన, భవ్యమైన ఒక మహామంత్రం. దీనిని ఉచ్ఛరించినపుడు వెలువడే శబ్దతరంగాలు అమితశక్తివంతమైనవి. అవి పఠించే వారిలో శక్తిపాతాన్ని సృష్టిస్తాయి. పర్యవసానంగా ఒక రకమైన ప్రకంపనలు (Vibrations) కలిగి శరీరం పులకరించి పారవశ్యం కలుగుతుంది. దాని వలన కలిగే ఫలం అమోఘం. ఈ పవిత్ర ఏకాక్షర మహా రహస్య మంత్రంలోనే వేదాలు, వేదాంతాలు మరియు ప్రమాణ గ్రంథాలన్నియు ఇమిడి యున్నాయి. అనేక గ్రంథాలలో ఓం గురించిన ప్రస్తావన ఉంది.

భాషాపరంగా పరిశీలిస్తే ఓంకారం ఏ భాషకు చెందినది కాదు. 'అ'కార, 'ఉ'కార, 'మ'కార శబ్దాల కలయికయే ఓంకారం అవుతుంది. అంటే 'ఓం' అనేది మూడున్నర అక్షరాల కలయిక. (అ+ఉ+మ+మ్). ఓంకారం నిర్వికారమైనది, అవికల్పమైనది, మహాశక్తివంతమైనది, పరమానంద రూపమైనది, నిత్యమైనది, శుద్ధమైనది, సత్యమైనది, బద్ధమైనది, ముక్తియైనది, అనిర్వచనీయమైనది, పరిపూర్ణమైనది. దీనిలో అఖండ భావం నిక్షిప్తమై వున్నది. వ్యక్తులవలె పరబ్రహ్మకు కూడా నామం కలదు. అట్టి నామమే ఓం లేదా ఓమ్. ఇది ఒక శబ్దం. దీనినే ప్రణవం అందురు. ఇది భగవంతుని నామం. ఇది అతి సరళమైనది. ఓంకార నాదం చేయడానికి భాషా పరిజ్ఞానం అవసరం లేదు. శ్రమపడవలసిన అవసరం లేదు. ఏమీ ఆంక్షలు కూడా లేవు.

ఓంకార నాదం చేయడం వలన శరీరంలో అధోభాగం నుండి ఊర్ధ్వభాగంవైపు అనగా మూలాధారం నుండి సహస్రారం (శిరస్సు) వరకు ఈ నాదం సాగుతూ ఉంటుంది. ఎప్పుడైతే ఓం అంటుంటామో శరీరంలో ఖాళీ స్థలం (Vaccum) ఏర్పడుతుంది. ఆ ఖాళీస్థలంలో యోగ శక్తి వచ్చి చేరుతుంది. దీనినే దైవానుగ్రహం అంటారు. మూడుసార్లు ఓంకార నాదం చేసి చూడాలి. చేస్తే గాని అదేమిటో తెలుస్తుంది.

ఈ ఓంకార నాదం వలన శారీరకంగా, మానసికంగా, ఆధ్యాత్మికంగా ఎన్నో లాభాలు వున్నాయి. ఆ మార్పులు మనలో ఎలా జరుగుచున్నవో ఇప్పుడు పరిశీలిద్దాం.

(ఎ.) శారీరక మార్పులు : దీర్ఘంగా శ్వాస, లోనికి తీసుకుని 'ఓం' అనే శబ్దాన్ని ఉచ్ఛరించాల్సి వుంటుంది. రాగయుక్తంగా పలకాలి. నెమ్మదిగా గాలి, లోపలికి పూర్తిగా తీసుకోవాలి. నెమ్మదిగా బయటకు వదలాలి. ఏమాత్రం తొందర పనికిరాదు. 'ఓం' అనే ముందు గాలి. లోపలికి తీసుకోవడం వలన పొట్టలో గాలి పూర్తిగా నిండుతుంది. దీనినే యోగ పరిభాషలో 'పూరకం' అంటారు. గాలి, లోపలికి పీల్చుకున్న తర్వాత వెంటనే ఓం అనకుండా 20 నుండి 30 సెకంట్ల వరకు పట్టి పెట్టాలి. దీనినే 'కుంభంకము' అంటారు. ఇక నెమ్మదిగా 'ఓం' అంటూ పూర్తిగా, గాలిని బయటకు వదలాలి. దీనినే 'రేచకం' అంటారు. ఏమాత్రం గాలి పొట్టలో వుండకూడదు. దీనినే 'శూన్యకం' అంటారు. ఈ స్థితిలో 20 నుంచి 30 సెకండ్ల వరకు అలాగే వుండాలి. ఇలా కుంభక, శూన్యక స్థితులను వారి వారి శారీరక ఆరోగ్యస్థితులను బట్టి నెమ్మదిగా క్రమంగా పెంచుకుంటూ పోవాలి.



ఇది సాధకులంతా కలిసి మూడు సార్లు సామూహికంగా 'ఓం'కారం చేస్తే, ఇంకా లాభంగా వుంటుంది. అలాచేస్తే 'పూరకం' కుంభకం, రేచకం, శూన్యకం మూడు సార్లు చేసినట్లు అవుతుంది. దీని వలన శరీరంలోని 72,000 నాడులు చలిస్తాయి. శరీరం చైతన్యవంతం అవుతుంది.

నోరు తెరచినపుడు 'అ'శబ్దం వస్తుంది. అంటే గొంతులో నుండి వస్తుంది.

నోరు మూస్తున్నప్పుడు 'ఉ' శబ్దం వస్తుంది. అంటే నోటిలో నాలుక వద్ద నుండి వస్తుంది.

నోరు మూసినప్పుడు 'మ్' శబ్దం వస్తుంది. అంటే పెదవుల నుండి వస్తుంది.

దీనిని బట్టి శరీరంలో 'అ' అనే శబ్దం వలన నాభి (బొడ్డు) నుండి క్రింది భాగం, 'ఉ' అనే శబ్దం వలన నాభి (బొడ్డు) నుండి పై భాగం, 'మ్' అనే శబ్దం వలన కంఠం నుండి పైభాగాలకు చలనం ఏర్పడుతుంది. ఈ చలన ప్రక్రియ వలన మూడు రకాల లాభాలు కలుగుతాయి.

మొదటిది ('అ'కారం) : 'ఆ' అన్నప్పుడు నాభి (ఉదరం) నుండి క్రింది భాగానికి చలనం కలుగుతుంది. అంటే ఆ భాగంలో శుద్ధి క్రియ జరుగుతుందన్నమాట. దీనివలన జీర్ణకోశ వ్యాధులు (గ్యాస్ ట్రబుల్స్, అజీర్ణం, ఎసిడిటి, కడుపునొప్పి, మలబద్ధకం, భగందరం, అపెండిసైట్స్, వెన్నునొప్పి, కాళ్లనొప్పులు) నిర్మూలించ బడుతాయి. నివారింపబడతాయి.

రెండవది ('ఉ'కారం) : 'ఉ' అన్నప్పుడు నాభి (ఉదరం) నుండి పైభాగానికి చలనం జరుగుతుంది. అంటే ఆ భాగంలో శుద్ధి క్రియ జరుగుతుందన్నమాట. దీని వలన శ్వాసకోశవ్యాధులు (దగ్గు, దమ్ము, ఛాతినొప్పి, జలుబు, రొంప, పడిశం, వాంతులు, ఊపిరితిత్తులకు సంబంధించిన వ్యాధులు) నిర్మూలించబడతాయి, నివారింపబడతాయి.

మూడవది (మ్ అనే శబ్దం) : 'మ్' అన్నప్పుడు కంఠంనుండి పై భాగానికి చలనం జరుగుతుంది. అంటే తలకు సంబంధించిన వ్యాధులు (ఆందోళన, కోపం, బి.పి., ఈర్ష్య, లోభితనం, తలనొప్పి, మానసికరోగాలు) నిర్మూలించడతాయి, నివారింపబడతాయి.

(బి) మానసిక మార్పులు : ఈ 'ఓం' ఒక పవిత్ర మంత్రం. "మననత్ త్రయేత ఇతి మంత్రః" అంటే మనసును పరిరక్షించేది మంత్రం అని అర్థం. మంత్రాలన్నీ 'శబ్దాలే. శబ్దాలకు మూలం ఓంకార శబ్దం. శబ్దాలకు శబ్ద రాజం ఓంకారం. మంత్రాలకు మంత్ర రాజం ఓంకారం. 'ఓం' అనేది ప్రణవం. నిశబ్దం నుంచి శబ్దం వచ్చింది. శబ్దం నుండి ఓం కారం వచ్చింది. ఓంకారం నుండి సృష్టి వచ్చింది. కాబట్టి సృష్టికి మూలం ఓంకారం. ఈ సృష్టియే బ్రహ్మం, బ్రహ్మముకు ఆది, అంతం లేదు. అంటే 'ఓం'ను పలికితే బ్రహ్మమును స్తుతించినట్లే.

ఓం అన్నప్పుడు గులాబీ రేకుల కంటే సున్నితమైన మెదడులో ఛార్జి చేయబడుతుంది. మన శరీరంలో ఉన్న 14,000 కోట్ల కణాలలో 1000 కోట్ల కణాలు మెదడులోనే వుంటాయి. కొన్ని నిమిషాల ఓంకార నాదం ప్రభావం కొన్ని గంటలవరకు వుంటుంది. అలా ప్రతిరోజు మూడు సార్లు



మూడుపూటలా అన్నట్లయితే రోజంతా మెదడుకు మేతపెట్టిన వాళ్లం అవుతాం. మెదడు శక్తివంతం అవుతుంది. ఏకాగ్రత, జ్ఞాపకశక్తి పెరుగుతుంది. ప్రాతఃకాలంలో 18 సార్లు ఓంకారనాదం చేయడం వలన మెదడు శక్తివంతంగా తయారవుతుంది. మెదడులో ట్యూమర్ / సిస్ట్‌లు ఏర్పడవు. కోపం, తలనొప్పి రాకుండా మానసిక ఆరోగ్యం ఏర్పడుతుంది. తద్వారా చురుకుగా పని చేయగలం. మానసిక వత్తిడి తగ్గుతుంది. ఆందోళన, ఆవేదన, విపరీత ఆలోచన పరంపర తగ్గుతుంది.

ఓంకార నాదం వలన శరీరానికి, మనసుకు సమన్వయం ఏర్పడుతుంది. అప్పుడు ఆధ్యాత్మిక సాధన సజావుగా సాగుతుంది.

(సి) ఆధ్యాత్మిక మార్పులు : 'ఓం' నుండి సర్వ శబ్దజాలం ఉత్పన్నమైంది. సమస్త శక్తులు కూడా 'ఓం' నుండియే ఉద్భవించినవి. గంగా, యమున, సరస్వతి, త్రివేణి సంగమమే ఓం. ఆగామి, ప్రారబ్ధ, సంచిత కర్మలన్నియు కూడా ఓంకారం వలన తొలగిపోతాయి. అంచేత 'ఓం' అనే ప్రణవనాదం ఆధ్యాత్మిక జీవితంలో అత్యంత ప్రాధాన్యతను సంతరించుకుంది.

'అ'కారం స్థూల జగత్తును, 'ఉ'కారం సూక్ష్మజగత్తును, 'మ' కారం కారణ జగత్తును సూచిస్తుంది. అంటే ఓంకారంలో ఈ జగత్తు అంతా ఇమిడి ఉన్నది. ఓంకారం జీవితాన్ని తరింపజేయును. అందుకే దీనికి తారకమంత్రం అన్నారు. ఓంకారం తెలిసినవాడే యోగి. ఓం ఉచ్చారణ చేయడం వలన ఈ క్రింది ఫలితాలు కలుగునని పెద్దలు చెప్పారు.

□□ సమస్త విఘ్నములను పోగొట్టును.

□□ సమస్త దోషములను తొలగించును.

- బంధము నుండి విముక్తి కలుగజేసి మోక్షమునకు మార్గమును చూపించును.
- ఆత్మ పదవిని పొందుటకు పనిముట్టు.
- పరమ శాంతి లభించును.
- ప్రణవ మంత్రమును జపించుటవలన పాపములు నశించును.
- ఓంకారనాదము అనే సాధనవల్ల రజోగుణ రహితుడగును.
- అమృతమైన బ్రహ్మమును పొందును.
- ఉపాసించువారు దేవతలవలె అమృతమును పొందుదురు.
- అపవిత్ర సంస్కారములను తొలగించును.
- సాధకుడు శాంతమైన, అజరమైన బ్రహ్మమును పొందును.
- ధ్యానాభ్యాసమును మథనము చేసిన నిగూఢమైన ఆత్మదేవుని దర్శించవచ్చు.
- దివ్యపరిణామము, మహత్తరమైన పరివర్తనను కలిగించును.
- బీజరూపములో చిత్తములోనే అగాధముగా ఉన్న సంస్కారాలకు ప్రేరణ కలిగిస్తుంది.
- అంతరదృష్టి, జ్ఞానం కలుగుతుంది.
- చిత్త చాంచల్యము నశిస్తుంది. ద్వంద్వత్వము నశిస్తుంది.
- సర్వ సంశయాలు తీరును. కోరికలు నెరవేరును. అహంకారం భస్మమగును.
- ఆధ్యాత్మిక మార్గమునందు పురోగమింప చేస్తుంది. మనస్సుకు ఏకాగ్రత నిస్తుంది.
- రాగ భావము, ద్వేషభావము తొలగిపోతాయి. దౌర్బల్యము, దేహదృష్టిని దహించి వేస్తుంది.



ఏ ఆధ్యాత్మిక కార్యక్రమమైన ఓంకారముతో మొదలుపెడితే బాగుంటుంది. ప్రారంభం ముగింపు మధ్యలో వున్నది ఎగ్జిస్టెన్స్ కనుక ప్రారంభం, ముగింపు బాగున్నప్పుడు ఎగ్జిస్టెన్స్ కూడా తప్పక బాగుంటుంది. కాబట్టి ప్రతి ఆధ్యాత్మిక కార్యక్రమం కూడా ఓంకారంతోనే మొదలుపెట్టారు. అలాగే శ్రీ వేంకటేశ్వరస్వామి వారికున్న విశ్వచక్రానికి ప్రతీక అయిన సుదర్శన చక్రంలోని ఆరుకోణాలు ఓంకారంతో కూడిన వలయాకృతిలోనివని అలాగే దీనిలో ఓం సహస్రార హుం ఫట్ అనే సుదర్శనషడక్షరీ మంత్రం నిక్షిప్తమై ఉంది. ఓంకారం అనే శబ్దం పరమాత్ముని సర్వోత్తమ నామం. ఈ ఒక్క నామోచ్చరణ చేయడం వలన పరమాత్మునికి ఉన్న ఈ క్రింది తొమ్మిది నామాలు పలికినట్లు అవుతుంది.

'అ'కారం వలన విరాట్టు – అగ్ని – విశ్వుడు

'ఉ'కారం వలన హిరణ్యగర్భుడు – వాయువు – తైజసుడు

'మ'కారం వలన ఈశ్వరుడు – ఆదిత్యుడు – ప్రాజ్ఞుడు

"తస్య వాచకః ప్రణవః" ఆ పరమాత్ముని వాచం అంటే పేరు ప్రణవం మహర్షి పతంజలి యోగశాస్త్రంలో సూత్రీకరించారు. అందుకే ఎందరో యోగులు,ముముక్షువులు, ధర్మాత్ములు, భక్తులు ఈ ప్రణవ నామాన్ని జపించి ముక్తిపొందారు.

ఎప్పుడైతే ఓంకారం రుచిస్తుందో అపుడు మమకారం, అహంకారం, అలంకారం, అధికారం తగ్గిపోయి స్వీకారం, ప్రతీకారం చేదుగా వుంటాయి. అంటే మనలో అవి తగ్గినపుడు అసంగత్వం ఏర్పడుతుంది. ఈ అసంగత్వమే

మోక్షానికి దారి చూపుతుంది. ఇకపోతే 'ఓం' అనే శబ్దంలోని మూడు అక్షరాలు మూడు అర్థాలకు ప్రతీకలు. క్రింది విశ్లేషణ గమనించండి.

అ=సృష్టికి ప్రతీక బ్రహ్మ (బ్రహ్మ వక్షస్థలంలో వుంది సరస్వతి)

ఉ=స్థితికి ప్రతీక విష్ణు (విష్ణు వక్షస్థలంలో వుంది లక్ష్మి)

మ్=లయకు ప్రతీక మహేశ్వర (మహేశ్వరుని వక్షస్థలంలో వుంది పార్వతి)

కాబట్టి ఓంకారము పలికినప్పుడు ... బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులతో పాటు సరస్వతి, లక్ష్మి, పార్వతులను కూడా స్మరించినట్లు అవుతుంది.

అలాగే

అ=స్థూల<br>
ఉ=సూక్ష్మ ఆత్మశరీరానికి ప్రతీక<br>
మ్=కారణ

ఆ=విశ్వ<br>
ఉ=తేజస్సు ఈశ్వరత్వానికి ప్రతీక<br>
మ్=ప్రజ్ఞ

అ=సత్వ<br>
ఉ=రాజస గుణాతీతానికి ప్రతీక<br>
మ్=తామస

అ=సంకల్ప<br>
ఉ=క్రియ ఆత్మశక్తికి ప్రతీక<br>
మ్=జ్ఞాన

అ=జాగృత<br>
ఉ=స్వప్న తురీయ స్థితికి ప్రతీక<br>
మ్=సుషుప్తి



అ=చైతన్యం<br>
ఉ=సుచైతన్యం ఉన్నత చైతన్యానికి ప్రతీక<br>
మ్=అచైతన్యం

అ=గతం<br>
ఉ=వర్తమానం సర్వకాలాలకు ప్రతీక<br>
మ్=భవిష్యత్

అ=సూర్యుడు<br>
ఉ=చంద్రుడు సూర్య చంద్రాగ్నులకు ప్రతీక<br>
మ్=అగ్ని

అ=ప్రారంభం<br>
ఇ=మధ్య స్థితులకు ప్రతీక<br>
మ్=అంత్యం<br>
-గా శాస్త్రాలలో చెప్పబడినాయి.

'ఓం'లో ఇన్ని విధాల లాభాలు వున్నాయి గనుకనే ఈ సృష్టిలో వున్న కొన్ని పక్షులకు, జంతువులకు కూడా విముక్తి కలగాలని భగవంతుడు వాటి అరుపులో అ, ఉ, మ్ అక్షరాల శబ్దాలు పెట్టాడు.

ఉదాహరణకు :-

-'అంబా' అంటుంది ఆవు ( ఈ అరుపులో 'అ' వుంది)

-'భౌ భౌ' మంటుంది కుక్క ( ఈ అరుపులో 'అ', 'ఉ', 'ఔ'లు వున్నాయి)

-'కొక్కరకో' అంటుంది కోడి ( ఈ అరుపులో 'ఓ' వుంది);

-'ఓండ్ర'పెడ్తుంది గాడిద ( ఈ అరుపులో 'ఓ' వుంది)

-'కావు, కావు' అంటుంది కాకి ( ఈ అరుపులో 'అ', 'ఉ'లు వున్నాయి)



–'రామ, రామ' అంటుంది రామచిలుక ( ఈ అరుపులో 'మ్' వుంది)

–'కృష్ణా కృష్ణా' అంటుంది గరుడ పక్షి ( ఈ అరుపులో 'అ' వుంది);

ఈ విధంగా పశు పక్ష్యాదులు కూడా తమకు స్పష్టమైన వాక్కు లేకపోయినను, ఉపదేశించు గురువు లేకపోయినను, ఆచరించు శక్తి సామర్థ్యాలు లేకపోయినను, సహజ సిద్ధమగు జీవుని ఆధారం చేసుకొని నిత్యము బ్రహ్మమును అన్వేషించుచునే వున్నాయి. తాము సాధన చేయుటయే గాకుండా మనందరకు తరుణోపాయమును సూచించుచున్నవి.

అదే విధంగా సరస్వతీ అమ్మవారు 'వీణ కచ్ఛపి ప్రణవ నాదానికి' ప్రతీక. ఓంకారం నుండి సమస్త అక్షర వాఙ్మయం జనించింది. అందుకే అక్షరాభ్యాసంలో ముందుగా ఓం నమః అని దిద్దిస్తారు. అందులో ప్రథమాక్షరం ఓం.

తెలుగు అంకెల పదాలలో (ఒకటి, రెండు, మూడు...) లోని ఒకటిలో ప్రథమాక్షరం ఓ(ఓం); అలాగే ఇంగ్లీషు భాషలో అంకెలు (One, Two, Three...) లలో One లో ప్రథమాక్షరం O (ఓ / ఓం) వుంది

గుడిలో గంట కొట్టినప్పుడు వచ్చే ప్రతిధ్వనిలో ఓం... శబ్దమే వస్తుంది.

సంగీత కచేరీలలో కూడా శ్రుతిలో వచ్చే శబ్దం ఓంకారమే.

చంటిపాపలు మాటలు రాకముందు వారి నుండి వెలువడే శబ్దాలు – అ, ఉ, మ, లే.



మూగవాళ్ళ నుండి మూడు పదాలు కూడా అ, ఉ, మాలే.

కష్టంగా కూర్చుని లేచే వాళ్ళ నుండి వచ్చే పదాలు అమ్మయ్యలో వుంది ఓం అవ్యక్తరూపమే.

క్రీడాకారులు బంతిని బ్యాట్‌తో కొట్టినప్పుడు, బంతిని తన్నినప్పుడు లేదా ఎగిరినప్పుడు, దుమికినప్పుడు చేసే శబ్దాలు అ, ఉ, మాలే.

ఇంతటి విశిష్టతను కలిగివున్న ఓంకారాన్ని ఆధ్యాత్మిక సాధకులు, సాయి భక్తులు గుర్తించి ప్రతిరోజు భక్తి శ్రద్ధలతో ఓంకారనాదాన్ని అభ్యసిస్తూ తమ జీవితాలను తరింపజేసుకోవాలి.

## ధనం–దానం "ధనం మూలమిదం జగత్"



కలియుగంలో ధనమే అన్నింటికి మూలం. మన కుటుంబానికి సరిపడే విధంగా ధనమును ధర్మ మార్గంలో సంపాదించాలి. సంపాదించిన దానిలో కొంత దానధర్మాల కొరకు వెచ్చించాలి. పరోపకారగుణం కలిగి ఆపదలో ఉన్నవారిని ఆదుకోవాలి.దానధర్మాలు చేయుటయే చేతులకు అలంకారము పాత్రత ఎరిగి దానం చేయాలి. అపాత్రుడికి దానం చేయరాదు. ధనార్జన అనేది కన్పించని ఊబి, అందులో చిక్కిన మానవుడు తీరం చేరుటకష్టం. అతిగా సంపాదించి, పరోపకారానికై వినియోగించని ధనం, శత్రువేగాని మిత్రుడుగాదు. సరిపడినంత సంపద, సంపాదించి ఉన్నదానితో సంతృప్తి చెందుతూ,శక్తికి మించి దాన ధర్మాలు చేయకుండా, పరోపకారంతో దైవచింతన కలిగి ఉన్నంతకాలం మానసిక ప్రశాంతతో తృప్తిగా ఉంటూ, అరోగ్యవంతులై, దైవానుగ్రహం పొంది, మనం చేసే సత్కర్మలవల్ల, మరణానంతరము ముక్తిని పొందుతాము. మానవుడి మరణానంతరము దేహం బూడిదైపోతుంది గాని ధనం మాత్రము ఆత్మతో వెళ్ళదు. మనం చేసే దాన ధర్మాల పుణ్యఫలం వల్ల జీవాత్మపరమాత్మలో లీనమవుతుంది.

# తేలికైన యజ్ఞం

– సేకరణ : **కె.ఆర్.విజయ్‌కుమార్,** మదనపల్లి, సెల్ : 9490278808



కైలాసంలో శివపార్వతులు కులాసాగా లోకం తీరు గురించి, బిడ్డల నడవడి గురించి ముచ్చటించుకొంటున్న ప్రదోషవేళ, జగన్మాత ముఖంలో ఆలోచనా వీచికలు పరచుకోవడం పరమేశ్వరుడు పసిగట్టి, విషయం ఏమిటని అడగ్గా, ఆ తల్లి, "నాథా ! భూలోకంలో మానవుల పరిస్థితికి జాలి కలుగుతుంది. పూజాపునస్కారాలకైనా తీరిక లేకుండా సతమతమవుతున్నారు. పనుల వత్తిడిలో నలిగిపోతున్నారు. త్రేతాయుగం, ద్వాపరయుగాల్లో మాదిరిగా వాళ్ళు యజ్ఞాలు చేసి పవిత్రులయ్యే మార్గంలేదు. మరి మన బిడ్డలు తరించే ఉపాయం ఇంకేదీ లేదా?"

పరమేశ్వరుడు అలౌకిక దరహాసంతో బదులు చెబుతూ, "లేకేమి దేవీ ! అతి సులభమైన తేలికైన యజ్ఞం ఒకటుంది. ఈనాటి మానవులకి..." అన్నాడు.

"ఏమిటిది స్వామి!" ఆశ్చర్యంగా అడిగింది పార్వతి. "అన్నం పరబ్రహ్మ స్వరూపం కాదా ! ఆహారం అన్ని జీవులకూ ఆధారం. ఆకలి బాధే అతి



ఎవరైతే ఆకలితో అలమటించే జీవికి తృప్తిని, ఆ బాధనుండి విముక్తిని కల్గిస్తారో, ఆ ఆహారం సాక్షాత్తు భగవంతునికి పెట్టిన దివ్యమైన నైవేద్యంగా పరిగణిస్తాను" శలవిచ్చేడు మహాదేవుడు.

ఆయనే మళ్ళీ "ఆకలి ఏ జీవికైనా ఒక్కటే. నోరు తెరచి అడగలేని మూగప్రాణులకే ఉంటుంది క్షుద్బాధ. పక్షులు, పశువులు, నిరుపేద మానవులు.... అందరిలోను, అన్నింటిలోను ఆకలి అగ్నిలా రగులుతుంటుంది. ప్రతి మనిషి రోజూ తను భుజించే పదార్థంలో కొంతభాగాన్ని, మరో ప్రాణికోసం కేటాయించి, ఆకలి తీరిస్తే, శతాధిక యజ్ఞాలు చేసిన పుణ్యఫలాన్ని పొందవచ్చు. క్రతువులు, అగ్ని హోత్రాలతో సంపాదించుకొనే పుణ్యంకంటే, అన్నదానమే అధికమైన ఫలాన్నిస్తుంది..." అంటూ సులభంగా తరించే మార్గాన్ని సూచించాడు శంకరుడు.

## పంచామృతాలు

పాలు, పెరుగు, నెయ్యి, తేనె, టెంకాయనీరు వంటివాటి కలయికయే పంచామృతము. వీటితో శివుని, దేవుని అభిషేకించవలెను.

పాలతో అభిషేకించడంవల్ల స్వచ్ఛమైన జ్ఞానం, సంతానప్రాప్తి కల్గును.

పెరుగుతో అభిషేకించడంవల్ల దేహప్రీతి వదలును.

నేతితో అభిషేకించడంవల్ల ప్రారబ్ధ,సంచిత, ఆగామి కర్మలనుండి విముక్తి లభించును.

తేనెతో అభిషేకించడంవల్ల విషయసేకరణ పిపాస కలుగును.

టెంకాయనీరుతో అభిషేకించడంవల్ల అహంకార వర్జితులగుదురు.

# పంచభూతాలు

పృథివి, జలం, అగ్ని (తేజస్సు), వాయువు, ఆకాశం పంచభూతాలు. ఆకాశం, గాలి, నిప్పు, నీరు, భూమి – ఈ ఐదింటిలో ఏది లేకపోయినా యీ ప్రపంచమే లేదు. సూర్యచంద్రులు లేకపోయినా మనకు మనుగడ సాధ్యం కాదు. అదేవిధంగా ధర్మాన్ని అనుష్ఠించే యజమాని లేకపోయినా యీ జగత్తు లేదు.

సృష్టి ఆరంభమున ప్రజాపతియగు బ్రహ్మ ప్రజలను సృష్టించెను. సృష్టినుండి ప్రళయకాలపర్యంతము జీవించు ప్రాణుల సృష్టించి గురురూపమున వారిని ఉద్ధరించును.

సర్వశక్తిమంతుడగు పరమేశ్వరుడు జగత్తును పాలించుచు అందరి హృదయమునుండి శాసించుచున్నాడు. జీవితములో మనము యే విధముగా నడుచుకోవాలెను అనే విషయం మనకు తెలిసేటప్పటికి మన ఆయువులో సగము కాలము తరిగిపోవుచున్నది. అప్పటికే యవ్వనకాలము గడిచిపోయి, పెద్దపులివలె వృద్ధాప్యము మీదపడుటకు సిద్ధమగును. యవ్వనములోని శరీరబలము తరిగి, చెవులు వినబడకపోవుట, కళ్ళు కనబడకపోవుట, జ్ఞాపకశక్తి తగ్గిపోవుట, సంసార బాధలధికమగుట చేత చింత, మధ్య మధ్య రోగములు మొదలైన వెన్నో చోటుచేసుకొనును.

సుఖదుఃఖములు కర్మాధీనము జ్ఞానము మన అధీనము.



ఆశను దాసీగా చేసుకున్నవారిలో లోకమంతా దాస్యం చేయును.

తృప్తిచెందవలసిన వేవనగా భార్యయందు, భోజనమందు, ధనమందు. తృప్తిచెందకుండునవి దానమందు, తపస్సు యందు మరియు చదువు నందు.

సుఖములుగాని, దుఃఖములుగాని, ప్రియములుగాని, అప్రియములుగాని యెప్పుడేది సంప్రాప్తమైన అప్పుడు దానిని సేవించుచు మనస్సున వ్యాకులత చెందరాదు.

ఆశచేత తృప్తిలేక, ధనమును మనము కూడబెట్టుటయేగాని, మరణానంతరము ఆ ధనము ఇండ్లు, వాకిళ్లు అన్నియు విడిచిపెట్టి వెళ్లవలసినదే.

ప్రతి ప్రాణియందు జీవాత్మ ఉంటుంది. జీవాత్మ పరమాత్మ స్మరణవల్ల పునీతమై తదుపరి జన్మలో దైవసాన్నిధ్యానికి దగ్గర అవుతుంది.

ముఖ్య గమనిక

**శ్రీసాయిదర్శన్ మాసపత్రిక ప్రతీనెల శ్రీసాయిదర్శన్ వెబ్‌సైటులో చదువుకొనవచ్చు. ముఖ్యమైన అధ్యాత్మిక విషయాలు తెలుగు, ఇంగ్లీషులో త్వరలో ప్రవేశపెట్టుచున్నాము. నేడే వెబ్‌సైట్ చూడగలరు!**

**e-mail : srisaidarshan@rediffmail.com**

**Website : www.srisaidarshan.org.in**

# దాన ధర్మాలు

*అనిత,* హైద్రాబాద్

ఏ కార్యాచరణలో నైనా కర్త తన శరీరేంద్రియాలతో చేసే పనులన్నింటిలో తప్పనిసరిగా దైవం తోడుండాలి. ఎంత స్వయం కృషి ఉన్నా దైవానుగ్రహంలేనిదే ఏ పనీ సవ్యంగా జరగదని తెలుసుకొని, తమ కార్య సాఫల్యతకు సహకరించి కరుణించిన దేవతల ప్రీత్యర్థం కృతజ్ఞతా భావంతో ఇంతో అంతో ఏ కొంతో వారికి సమర్పించడం ముఖ్య కర్తవ్యమని మన ధర్మశాస్త్రాలు ఘోషిస్తున్నాయి. యజ్ఞాల ద్వారా, దానం ద్వారా, తపస్సు ద్వారా భగవంతుని ప్రసన్నుని చేసుకోవాలని మహర్షులు చెప్పారు.

మన హిందూ ధర్మంలో దానం, గొప్ప విశిష్ఠతను సంతరించుకుంది. పండుగ పబ్బాలలో, శుభకార్యాలలో, పూజార్చనలలో, వ్రతోద్యాపనలలో దానం అవశ్యకం. స్వార్థపూరితమై కేవలం బంధువర్గం వరకే పరిమితమైన ఇచ్చిపుచ్చుకోవడాలు దానం క్రిందకు రావు. బ్రాహ్మణుడు నిర్వహించిన వైదిక కర్మకు ప్రతిఫలంగా ఇచ్చే దక్షిణ తాంబులం కూడా దానం కాదు. ప్రత్యుపకారంగా దేనిని ఆశించకుండా ఇచ్చేది దానం. ఆదాయంలోని కొంత ధనాన్ని దేవతలకు దాన ధర్మాలకు, పుణ్యకార్యాలకు కేటాయించాలని అన్ని మతాలలోనూ ఉంది. మన పూర్వీకులు దాన ధర్మాలు విరివిగా చేసేవారు. ధర్మకార్యాలు చేసేవారికి సహకరించేవారు కూడా. కాని తరతరానికి స్వార్థం బాగా పెరిగిపోతూండటం వలన వందలు, వేలు, లక్షలు, కోట్లు గడించినా ఇంకా ధనం సంపాదించాలని దాన్ని పెంచాలనే తపనతో తంటాలు పడటం. ఇదే నా జీవిత ధ్యేయం? తృప్తికి మించిన ధనం లేదంటారు. ధనమెంతున్నా తృప్తిలేకపోతే మనిషి మనసుకు శాంతి ఎక్కడిది? సంసార బాధ్యతలను సక్రమంగా నిర్వహించడం ముఖ్య కర్తవ్యం.



దీనికొరకు ధనమవసరం, కాని బరువు బాధ్యతలన్నీ తీరిన తర్వాత కూడా లక్షల ఆస్తి ఉండి ధనం గడించాల్సిన అవసరమసలు లేనప్పుడైనా ప్రశాంతంగా రామా! కృష్ణా ! అని విష్ణుస్మరణ చేయరు కదా. కాలక్షేపం కోసమనో, ఉబుసుపోక అనే సాకుతోనో లేదా సమాజ సంక్షేమం పేరుతోనో, నౌకరీ అనే ఏ చాకిరీనో వ్యాపారమో చేస్తూంటారు. అనారోగ్యంతో పూర్తిగా అశక్తులై పోయి మంచాన పడేవరకు, లేదా చివరి ఊపిరి ఉన్నంతవరకు ఏ చిన్నదో పెద్దదో ఉద్యోగమో ఊడిగమో చేస్తూ అసువులు కోల్పోతారు. జీవితాంతం ధనసంపాదనే గాని అంత్యదశలోనైనా హాయిగా కూర్చుని దైవచింతనలో భగవద్భక్తి సమపార్జించుకోరు.

సంపాదనలో కొంతైనా ధనం దేవతలకు దాన ధర్మాలకు వినియోగించక స్వార్థబుద్ధితో సమస్త సంపదను తామే అనుభవించే వారి (తాహతుకు తగ్గట్లు) నెత్తి మీద పిడుగు పడ్డట్లు, వందలు, వేలు, లక్షలు, కోట్లు నష్టపడే ఆపదవచ్చి పడుతుంది. లోలోపల రగులుకుంటున్న కానరాని ఘోరమైన రోగాలు ఆకస్మాత్తుగా భగ్గుమని బయటపడతాయి. పుణ్యసంచయానికి ఉపయోగపడని వారి ధనసంచయం శరీరాలు ఎందుకూ పనికిరాకుండా వ్యర్థమైపోతాయి. అట్టి పరిస్థితులలో ఐశ్వర్యంతో ఆరోగ్యాన్ని తిరిగి పొందాలని అలమటిస్తూ పెద్దపెద్ద డాక్టర్లని ఆశ్రయిస్తారు. ఆసుపత్రులకు ఆపరేషన్లకు ఔషధాలకు లక్షలు ఖర్చుపెడతారు. కాని పాపం డబ్బుతో నయంకాని జబ్బులు బ్యాంకులో భద్రంగా దాచుకున్న ధనసంచయాన్ని దోచుకొనిపోతాయి. అప్పుడు గుండెలు బాదుకుంటూ ఆదరా బాదరా అన్నవరానికో, కోటప్పకొండకో, సింహాచలానికో, శ్రీశైలానికో, షిరిడీకో, తిరుపతికో పరుగెట్టి, "ప్రభూ ! పరాత్పరా ! ప్రాణాలు రక్షించు తండ్రీ !" అంటూ ఆక్రోశిస్తారు. ఆపదలు ఆదివ్యాధి బాధలు వచ్చి మీదపడ్డప్పుడు, ఆపదమొక్కులవాడు వెంకటేశ్వరస్వామో, సాంబశివుడో, సాయిదేవుడో గుర్తుకు వస్తారు. కళ్ళు బాగైతే కళ్ళు, చెవులకు చెవులు, ముక్కుకు ముక్కు, కాలుకు కాలు, చేయికి చేయి, చేయించి సమర్పించుకుంటామని

వ్యాపారసరళిలో మ్రొక్కుబడులు మ్రొక్కుకుంటారు. నిలువెత్తు ధనరాసి పోసినా ప్రాణాలు నిలువని పరిస్థితిలో భగవంతుడు కరుణించి ప్రాణరక్షణ చేయగా కృతజ్ఞతా భావంతో, ఆర్ద్రహృదయంతో ఆ పరమాత్మను పాదాభివందనం చేస్తే చాలు, ప్రతిఫలమేమి ఆశించని ఆ దయామయుడు, అయిసైపోయి అమాంతం హృదయానికి హత్తుకొని తన సాన్నిధ్య సౌభాగ్యాన్ని ప్రసాదిస్తాడు. కాని అలా చేయరు సరికదా పై పెచ్చు ఆ అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయకుని ఓ వెత్తి వెంగళ్ళప్పక్రిందో లేక ఓ బికారి క్రిందో జమకట్టి అయిదు పది రూపాయలతో రేకుముక్కల కళ్ళు, ముక్కు, కాళ్ళు, చేతులు, చెవులూ వగైరా కొని హుండీలో పడవేసి మ్రొక్కు విరగడైందని సంతోషిస్తారు లేదా ఆ ఖర్చుకాకుండా ఉచితంగా తలనీలాలు నిచ్చి ఎంతో త్యాగం చేసినట్లు భావిస్తారు. తమ పరువు ప్రతిష్ఠలకనుగుణంగా లక్షలు ఖర్చుచేసి డాంభికముగా దర్పంగా పెళ్ళిళ్ళు చేస్తారు. కాని పెళ్ళి కుదిరి అన్ని సవ్యంగా జరిపించిన ఆ దేవదేవునికి పదో, పాతికో రూపాయలతో రేకుల మంగళసూత్రాలు, మట్టెలు కొని హుండీలో పడవేస్తారు. లేదా నిత్యకళ్యాణమూర్తికి కల్యాణం చేయించామని సగర్వంగా గొప్పగా చెప్పుకుంటారు. ఒక రూపాయి టికెట్టుతో లక్షరూపాయల లాటరీగాని ఆశించే విధంగా కోటికి పడగలెత్తాలనే గొంతెమ్మ కోరికలతో కోట్ల రూపాయలకు కూడా వంగని భక్తవత్సలుణ్ణి ఒక కొబ్బరికాయకొట్టి లేదా ధునిలో పడవేసి లొంగతీసుకోవాలను కోవటం మూర్ఖత్వమే కదా !

ఒక విత్తనాన్ని భూదేవికి అర్పిస్తేనే, మరిన్ని విత్తనాలు లభ్యమౌతాయి. ఇది సృష్టిధర్మం. ప్రపంచ వ్యవహారంలో కూడా ఇదే వర్తిస్తుంది. ఒకటి తీసుకుంటే దానికి పదిరెట్లు తిరిగి ఇస్తానని సాయిబాబా అనడమే కాదు స్వయంగా దక్షిణను అడిగి మరీ పుచ్చుకుని భక్తులను ఋణవిముక్తులను చేసేవారు. అంతేకాదు, మా గురువు "తీసుకో, తీసుకో" అంటే మీరు "తే, తే" అంటారు అని కూడా అనేవారు. దీని అర్థం గ్రహించండి.



# ఓం సాయి శ్రీసాయి జయ జయ సాయి నామసంకీర్తన చేసిన స్థలములు - వాటి ప్రాముఖ్యత

పి.హరినాథ్, నెల్లూరు

1. తమిళనాడులో నైవేలీ దగ్గర "వడలూరు' పట్టణములో శ్రీరామ లింగేశ్వరస్వామి (జ్యోతి రామలింగేశ్వరస్వామి)వారి సంస్థానము చాలా ప్రాముఖ్యము చెందినది. ఇచ్చట జ్యోతి నిత్యము వెలుగుతుంది. ఇచ్చట నిత్య అన్నదానము జరుగుచున్నది. అప్పటిలో వేసిన గాడిపొయ్యి ఇప్పటివరకు ఆరలేదు. ఏ సమయములోనైనా ఇక్కడ ఆకలిగొన్నవారికి అన్నం పెడ్తారు. ఈ గాడిపొయ్యిని, అన్నదానం చూడటానికి చాలామంది ఇక్కడకు వస్తారు. ఇటువంటి పవిత్రమైన స్థలంలో అనుకోకుండా శ్రీసాయినాథుని ఆశీర్వచనములతో "ఓం సాయి శ్రీసాయి జయ జయ సాయి" నామము 2002 సం॥లో శ్రీశంకరయ్యగారి అధ్వర్యములో జరిపినాము.

ఆ యొక్క సమయములో అక్కడనుండి ఎక్కడెక్కడ సాయినామము చేసితిమో మన పాఠకులందరికీ తెలియజేస్తున్నాను.

2. ఎప్పటినుండో తిరుమల కొండపై సాయినామం చేయవలెనని శ్రీశంకరయ్యగారు అనుకునేవారు. బహుశా బాబాగారి కోరిక అయివుంటుంది. మొదట శ్రీకాళహస్తిదగ్గర ఉన్న శుకబ్రహ్మాశ్రమములో 12 గం॥లు సాయి నామము, మహానుభావుడు శ్రీవిద్యాప్రకాశనందగిరి సమాధి ముందరే సాయినామము జరిగినది. సాయినామం అయిన వెంటనే ప్రస్తుత పీఠాధిపతి శ్రీవిద్యానంద ప్రకాశనందగిరి స్వాములవారు ఆశీర్వచనములు చెబుతూ,

“ఈ అఖండ సాయినామము వలన, ఆశ్రమమే కాదు, శ్రీకాళహస్తి పట్టణము అంతా తరంగాలతో నిండిపోయిన”దని సంతోషంతో చెప్పినారు. అక్కడ ఆ రాత్రి విశ్రమించి, ఆశ్రమమువారు ఇచ్చిన ఆతిథ్యము తీసుకొని, తిరుపతి బయలుదేరి వెళ్ళి శ్రీమతి సరోజమ్మగారింటికి ఉదయము చేరినాము. శ్రీమతి సరోజమ్మగారు శ్రీభగవాన్ వెంకయ్యస్వామివారికి అంకిత భక్తురాలు. వారియింటిలో 12 గంIIలు శ్రీసాయి అఖండనామము రాత్రివరకు చేసినాము. రాత్రి అక్కడనే ఉండి, ప్రొద్దునే తిరుమల శ్రీవేంకటశ్వర స్వామి దగ్గరకి జీపులలో బయలుదేరి వెళ్ళి, తిరుమలలో పనిచేసే స్టేట్ బ్యాంకు ఆఫీసరు శ్రీచౌదరిగారి ఇంటికి వెళ్ళినాము. వారి శ్రీమతి శ్రీమతి లలితమ్మగారు మమ్ము సాదరముగా ఆహ్వానించినారు. వారు మమ్ములను కుశల ప్రశ్నలు వేసి అఖండసాయినామం మా క్వార్టురులో కూడా జరిపించమని కోరినారు. సాయివారి ఇల్లు పావనం చేయుటకు వారిచే సాయినామం చేయించమని వారిలో తలంపులేపి మాకు ఎప్పటినుండో తిరుమలలో సాయినామం జరిపించాలన్న కోరిక నెరవేరునట్లుచేసిరి. వారి క్వార్టర్సులో అఖండంగా ‘ఓం సాయి శ్రీ సాయి జయ జయ సాయి’ నామము అద్భుతముగా జరిగినది. దంపతులిద్దరు, వారి బంధుమిత్రులతో పాటు ఎంతో ఆప్యాయముగా సాయిప్రసాదము పెట్టినారు. శ్రీసాంబమూర్తి వారి భజనబృందమువారి భజన చేశారు. సుమారు 30 మందితో సహా భజన బృందంవారికి శ్రీస్వామి దర్శనము అయినది. సాయికి, శ్రీవేంకటేశ్వరస్వామికి భేదములేదని, శ్రీసాయి నామముతో నిరూపించబడినది. ప్రొద్దుటనే అందరు క్రింద తిరుపతికి వచ్చి చిIIచంద్రశేఖరరావుగారి గృహములో సుమారు 4 గంIIలు సాయినామము చేసి, వారు ఇచ్చిన ప్రసాదములు తీసుకొని పాండిచ్చేరికి బయలుదేరినాము.

పాండిచ్చేరిలో ఇంకా అప్పటికే పూర్తి స్థాయి సాయిమందిరం నిర్మాణం



కాలేదు. మొదట శ్రీసుబ్రహ్మణ్యం మరియు ఇతర ట్రస్టీలు వారికి 24 గంIIలు సాయినామం జరిపించడం ఇష్టం లేదు. ఎందుకంటే అందరికీ వసతులు సరిగా చేస్తామో లేదో అనే అనుమానం ఎక్కువ. ఖర్చు అవుతుందేమో అని కూడా సందేహం. అట్లాంటివారు మాకందరికీ చాలా శ్రద్ధగా స్వాగతం పలుకుతూ మంచివసతి, భోజన సదుపాయాలు ఏర్పాటుచేసినారు. అద్భుతముగా 24 గంIIలు సాయి అఖండ నామం పాండిచ్చేరిలో జరిగినది. ప్రస్తుతము అక్కడ బ్రహ్మాండమైన సాయినాథుని మందిరం వెలసినది.

అక్కడనుండి మేము ముఖ్యముగా పెద్దఎత్తున సాయినామము జరుపవలసిన ప్రదేశము నైవేళి టౌన్‌షిప్. అక్కడకు పాండిచ్చేరినుండి ఏర్పాటుచేసిన బస్సులో మధ్యాహ్నం 2 గంIIలకు నైవేళీ చేరినాము. నైవేళీలో ఆంధ్రసమితి ఉన్నది. పెద్ద ఉద్యోగులంతా ఆంధ్రులే. చిIIసుభాషిణివారి భర్త శ్రీ కృష్ణసాయిగార్ల సహకారముతో సాయంకాలము ‘నగర సంకీర్తన’ అన్ని వీధులలో తిరిగితిమి. శ్రీసాయినామ సంకీర్తన ఆంధ్రసమితి ప్రాంగణంలో ధుని వెలిగించబడి తెనాలి, విజయవాడ, ఒంగోలు, నెల్లూరు మరియు కదిరి భక్తబృందమువారిచే జరిగినది. విపరీతమైన సాయిభక్తులచే ఆ ప్రాంగణమంతా నిండిపోయినది. ఎప్పుడు అటువంటి కార్యక్రమము చూడలేదని భక్తులు సంతోషించినారు.

అక్కడనుండి అనుకోకుండా శ్రీజ్యోతి రామలింగేశ్వరస్వామి సంస్థానము ఉన్నటువంటి ‘వడలూరు’ చేరి సాయంత్రం 3 గంIIలు సాయినామము చేసి రాత్రి బయలుదేరి ఉదయమునకు మద్రాసుకు చేరినాము. మద్రాసు నుండి తిరుగు ప్రయాణమైనాము.

# సాయినామం - సర్వపాపహరణం ,

# సాయి స్మరణం - భవ హరణం

సాయి భక్తులకు విజయదశమి ఎంతో విశేషమైనది. 1918 అక్టోబర్ 15వ తేదీ, విజయదశమినాడు బాబా మహాసమాధి చెందిన విషయం మనకు తెలుసు. బాబావారు వాస్తవానికి మన మధ్య భౌతికముగా లేనప్పటికి తమ ఉనికి పలురకాలుగా వ్యక్తపరుస్తుంటారు. బాబా తన సమాధి నుండి భక్తులను సంరక్షిస్తున్నారు.

సాయినామం సకల దేవతలను సంతృప్తిపరచే దివ్యనామ మంత్రమిది. ఇదే మన ధ్యానం. పదే పదే ఉచ్ఛరించడంవల్ల పాపాలు నశిస్తాయి. అంతః కరణం శుద్ధీకరింపబడుతుంది.

సాయి 1918 విజయదశమి రోజున మహాసమాధి చెందారు. బాబా విజయదశమికి 90వ సం॥లు అడుగిడు సందర్భముగ ప్రతీ పట్టణము, ప్రతీ గ్రామములో సాయిభక్తులు ఒక సంఘంగా ఏర్పర్చుకుని "ఓం సాయి శ్రీ సాయి జయ జయ సాయి" నామము 90మంది భక్తుల ఇండ్లలో 90 రోజులు, ప్రతీరోజు ఒక భక్తుని ఇంట్లో 90 ని॥లు "ఓం సాయి శ్రీ సాయి జయ జయ సాయి" నామజపము, భక్తులందరు ఏకకంఠముతో ఉచ్ఛరించవలెను. అందువల్ల ఆ వీధి, ఆ ఇల్లు పావనమగును మరియు సాయి అనుగ్రహమునకు పాత్రులు కాగలరు.

మొదట 10 ఇండ్ల లిష్టు తయారుచేసుకొనవలెను. మొదటి ఇంట్లో



ప్రారంభించిన నాటినుండి సాయినామం మా ఇంటిలో జరపండి, మా ఇంట్లో జరపండి అని భక్తులు ముందుకు వచ్చెదరు.

సాయినామ స్మరణ చేయు ఇంటియందు బాబాగారిని అలకంరించి, పూలు వారిచుట్టు పేర్చవలెను. భక్తులు ఎవరైనా కొబ్బరికాయలు తెచ్చిన అవి వారి పేరుమీద కొట్టవలెను. సాయినామము 90 ని॥లు పూర్తయిన తదుపరి సత్సంగము లేదా భజన పాటలు 30 ని॥లు జరిపించి వచ్చిన వారికి తీర్థప్రసాదములు (ప్రసాదము పలురకములైన పండ్లముక్కలు చేసి) భక్తులకు పంచవలెను.

ఈ కార్యక్రమము ప్రచారము చేయు సంఘములు లేదా వ్యక్తులు శ్రీసాయిదర్శన్‌కు ఎవరియింటిలో జరిగినది తెల్పుతూ వారి పూర్తి చిరునామా ఒక పోస్టుకార్డుపై వ్రాసి పంపవలెను. ఈ కార్డు మాకు చేరిన తరువాత వారికి శ్రీసాయిబాబా ఊధి, కార్డుసైజు బాబా ఫోటో, శ్రీసాయిదర్శన్ పత్రిక ఉచితముగా పంపబడును. యితర వివరములకు


**శ్రీసాయిదర్శన్ రావూజీ గారితో సంప్రదించగలరు.**

**సెల్ : 98667 48099**

**లేదా**

**ఓం సాయి శ్రీ సాయి జయ జయ సాయి ప్రచారకులు**

**శ్రీశంకరయ్యగారితో (సెల్ : 93910 37983 ) సంప్రదించగలరు.**





# లేఖలు

శ్రీరావూజీగారికి ప్రేమతో వ్రాయులేఖ

సద్గురు సాయిబాబాకు హృదయపూర్వక నమస్కారములు

శ్రీనరసింహస్వామీజీకి, శ్రీసాయి పాదానంద రాధాకృష్ణస్వామిజీకి వందనములు.

జూలై మాసపు శ్రీసాయిదర్శన్ నాకు 16వ తేదీన రాత్రి 8.30 ని॥లకు అనుకోని విధంగా చేతికందినది. గురుపూర్ణిమ విశేషములు యేమి ముద్రించారన్న కుతూహలముతో చదువుటకు ముందంజ వేసితిని. దానిలో "గురుకృపయే గురుపూర్ణిమ" అను వ్యాసము నాకు చాలా నచ్చింది. 'గురూపదేశం' మీరు వ్రాసినది కూడా చదువుటకు బాగుంది.

మనసుంటే మార్గముంటుంది. మార్గము తెలిసినప్పుడు గమ్యస్థానము చేరుట సులభము కదా ! అలాగే 'సాయి' నామము జ్ఞప్తియుంచుకున్నంత మాత్రమున, చెడు పలుకుట వలన, వినుట వలన కలుగు పాపములు తొలగును కదా !

ప్రతి మనిషి 'నమ్మకము', 'ఓపిక'(సహనము) అను రెండు గుణములు తన నిత్యజీవితములో అలవరచుకొన్నచో వారును మంచి మార్గములో నడుచుకొనగలరు. 'ఊధి'ని నుదుటపెట్టుకొని, సకల రోగనివారిణి అని కొంత నోటిలో వేసుకొన్నచో జీవితము 'మూడు పువ్వులు, ఆరు కాయల'వలె సాగించవచ్చునని నా తలంపు. సాయిబాబా మనమెవ్వరేమి కోరినను 'అల్లా చేసెదరుగాక!' అనెదరే గాని తాము చేసెదమని చెప్పేవారు కాదు. 'అల్లామాలిక్' అనటము బాబా ప్రత్యేకత. బాబా కథలు, బాబా చేసిన లీలలు, బాబా చూపిన మహిమలు – వీటిని అర్థము చేసుకొని, వాని ప్రకారము మన జీవితము కొనసాగించినచో మనమెప్పుడు దారి తప్పమని నా ఉద్దేశ్యము.

వైశ్యయోగి గంగఖీరు సాయిబాబా కుండలతో నీరు తెచ్చి వారు నాటిన చెట్లకు నీరు పోయుచుందుట చూసి, "సాయిబాబా సామాన్యమానవరూపములో వుండే ఒక విలువకట్టలేని మణి" అని అనేవారు. ఆనందనాథుడను యోగిపుంగవుడు



సాయిని చూసి "ఈయనొక అమూల్యమైన రత్నము, వజ్రము" అనినారు. సాయిబాబా వీరిరువురి మాటలను తన జీవితములో సాయిభక్తులకు చూపించినారని వ్రాయుట అసత్యము కాదు కదా ! ఇటువంటి మహాత్ముని గూర్చి పలువురి అభిప్రాయాములతో వ్రాసిన వాటిని శ్రీసాయిదర్శన్‌లో ముద్రించి మానవలోకానికి 'సాయి'ని గూర్చి తెలుసుకొనుటకు మీరు తలపెట్టిన కార్యము మెచ్చుకోదగినది. ఈ సందర్భములో ఆ షిరిడీ సాయినాథుని ప్రేమజల్లు మీపైన, అసోసియేట్ ఎడిటర్ శ్రీమతి ఆర్.లక్ష్మీగారిపైన యెల్లప్పుడు కురవవలెనని నిండుమనసుతో ప్రార్థించుచున్నాను.

మహాసముద్రములో బెస్తవాండ్లు ప్రతిరోజు చేపలు పట్టుచుండినను చేపలు వారికి దొరకని రోజంటూ ఉండదు కదా ! ఆ విధంగా సాయి గురించి ఎందరు ఎన్ని విధములు వ్రాసినను, సాయి భక్తులు చదువుటకు వెనుకాడరని నా అభిప్రాయము. ఇది నిజము ! సత్యము కూడా ! సాయిబాబా తనను నమ్మినవారికి నమ్మకము వమ్ముచెయ్యరని యెన్నో సంఘటనలు జరిగినవి కదా ! కావున నమ్మండి! చేయండి సాయిపూజను. భజనలు చేయండి. ఇది సబబు కదా !

శ్రీసాయి ప్రచారప్రతినిధులు కావాలి అని వ్రాసినారు.

నేను సాయిబాబా సేవ నా వీలయినంత వరకు చేయవలయునని, బెంగుళూరులో త్యాగరాజులో వుండే శ్రీసాయి స్పిరిట్యుయల్ సెంటర్‌లో చిన్న చిన్న సేవలు అందించుచున్నాను. ఇది కేవలము మీకు తెలియపరచడము కోసము వ్రాయడమే కాని వేరొకటి కాదు. కాబట్టి ఏవిధమైన సేవలు చేయవలెను, ఏవిధంగా శ్రీసాయి ప్రచారము చేయవలయునన్న విషయములు వివరముగా ఒక లేఖ మూలంగా నాకు తెలిపితే, నేను నా శక్తికొలది, ఆ పుణ్యమైన కార్యమునకు శ్రీకారము చుట్టెదను. తప్పక వ్రాసెదరని అనుకుంటాను.

చందాదారులకు మనవి అనే శీర్షికలో ముగ్గురు చందాదారులుగా చేర్చినవారికి ఉచిత కానుక పొందండి అని తెలిపితిరి. వీలయినంతవరకు చందాదారులను చేర్చుటకు ప్రయత్నించెదను. ఈ విధముగా మీ శ్రీసాయిదర్శన్‌పత్రికకు ఎక్కువ భక్తులను చందాదారులుగా చేర్చి ఒక ప్రక్క మీయొక్క ఉచిత కానుకలందుకుంటూ, ఇంకొక ప్రక్క సాయిభక్తులు కొత్త కొత్త విషయములు మీ పత్రికమూలంగా తెలుసుకొనుటకు అవకాశము కల్పించెదనని మీకు

తెలియపరచుటకు నాకెంతో సంతోషంగా యున్నది.

సమర్థ సద్గురు శ్రీసాయిబాబావారికి మరియొకసారి నా హృదయ పూర్వక నమస్కారములు తెలుపుతూ, మీరు తలపెట్టిన కార్యము అనగా శ్రీసాయిదర్శన్ సాయి ప్రబోధ ప్రచార మాసపత్రిక ప్రతిసాయి భక్తుని చేతిలో తప్పక ఉండునట్లు శ్రీసాయిబాబా అనుగ్రహమందవలెనని ప్రార్థిస్తూ నా యీ చిన్న లేఖను ముగించుచున్నాను.

జై శ్రీ సాయిబాబా జై శ్రీ సాయిదర్శన్
శ్రీసాయిబాబా సేవలో

**పి. ఆంజనేయులు గుప్తా,**
1842, 34వ క్రాస్, బియస్‌కె 2వ స్టేజి, బెంగళూరు - 560 070

మహారాజశ్రీ శ్రీసాయిదర్శన్ ఎటిటర్ రావూజీ గారికి నమస్కరించి వ్రాయునది.

నేను టీచరుగా రిటైరయి 1997 సం॥ నుండి పొన్నూరులో ఆంజనేయ స్వామి గుడి దగ్గరలో యున్న సద్గురు శ్రీషిరిడీసాయి మందిరకమీటీలో వివిధ పదవులలో యుంటూ శ్రీసాయిబాబా సేవ చేసుకొనే అదృష్టము కల్గినది. ప్రస్తుతము కమీటీలో వైస్ ప్రెసిడెంట్‌గా వుంటున్నాను. తమరు గతములో పొన్నూరు వచ్చినప్పుడు మా గుడిని దర్శించినారు. అప్పుడు మిమ్ములను దర్శించే భాగ్యం నాకు కలిగింది. శ్రీఆలూరు గోపాలరావుగారి అధ్వర్యంలో ఆది, గురువారాలు సత్సంగములు జరుపుకొనుచున్నాము. వారి ప్రేరణతోనే శ్రీఅబ్దుల్లా అను శీర్షిక గురించి వ్రాయగలిగితిని. నేను నాలుగు సంవత్సరాలనుండి శ్రీసాయిదర్శన్ చందాదారుడిని.

సదా శ్రీసాయిసేవలో

సాయిబంధు
**యం. విద్యాసాగరరావు**, రిటైర్డ్ టీచర్, పొన్నూరు

Printed Published and owned by A.V.Ramana Rao at 1-5-62/2/B Maruthi Nagar, Hyderabad - 500 060. Printed at Sri Kala Printers, 1-1-781/B/4, Gandhi Nagar, Hyderabad - 80 Ph : 27611864, on behalf of Roopa Art Centre, Keshav Memorial Lane, Narayanaguda, Hyderabad - 029. Editor - **A.V.Ramana Rao**